ప్రతి అక్షరం - ప్రజల కోసం
# రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
యాదాద్రి భువనగిరి
పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 148
గురువారం 28 నవంబర్ 2024 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ / HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## రెండో టెస్టుకు కూడా శుభ్‌మన్ గిల్ దూరం?



07



# తెలంగాణపై మోడీ ప్రత్యేక ఫోకస్

### మన ప్రభుత్వం వచ్చేలా కష్టపడాలని టీబీజేపీ క్యాడర్‌కు సూచన



- ఢిల్లీలో బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో భేటీ
- కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న అభిప్రాయాలపై చర్చ
- బీజేపీ కార్యాచరణపై ప్రస్తావన

ఢిల్లీ, రోమింగ్ న్యూస్: తెలంగాణపై బీజేపీ ఫోకస్ పెట్టింది. స్వయంగా ప్రధాని మోడీ దృష్టి సారిస్తున్నారు. రాష్ట్ర రాజకీయాలతో పాటు పలు కీలక అంశాలపై ఆయన ఆరా తీశారు. ఢిల్లీలో పార్లమెంట్‌లోని ప్రధాని కార్యాలయంలో బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీతో బుధవారం ప్రధాని మోడీ భేటీ అయ్యారు. ఈ భేటీలో భాగంగా ఎమ్మెల్యేలు, ఎంపీలను.. ప్రధాని మోడీ ఆప్యాయంగా పలకరించినట్లు సమాచారం. అందరి బాగోగులు అడిగినట్లు తెలిసింది. నాయకులంతా కలిసి మెలసి పని చేయాలని సూచించినట్లు టాక్. అలాగే తెలంగాణలో కష్టపడి పనిచేయాలని, బీజేపీ ప్రభుత్వం వచ్చేలా సమర్థవంతంగా పని చేయాలని మోడీ శానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ భేటీలో ప్రధానంగా

మిగతా 2 లో

# లోక్‌సభలో రచ్చరచ్చ

### అదానీపై విపక్షాల గందరగోళం

#### అదానీని వెంటనే అరెస్ట్ చేయాలని రాహుల్ డిమాండ్

- అదానీ విషయంలో కేంద్ర సర్కార్ వైఖరి ఏమిటో చెప్పాలి
- సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపైనా చర్చ
- అసభ్యకర పోస్టుల వ్యవహారంపై కేంద్రం సీరియస్
- కఠినమైన చట్టాలను రూపొందించాన్న మంత్రి అశ్విని వైష్ణవ్



న్యూఢిల్లీ, రోమింగ్ న్యూస్: అదానీ గ్రూప్ అధి నేత గౌతమ్ అదానీపై అమెరికాలో లంచం ఆరోపణలు, ఉత్తరప్రదేశ్‌లోని సంభాల్‌లో జరిగిన హింసా కాండపై బుధవారం లోక్‌సభ లో విపక్షాలు గందరగోళం సృష్టించాయి. ఈ సందర్భం గా విపక్ష ఎంపీలు కూడా నినాదా లు చేశారు. దీంతో తొలుత లోక్‌సభ 12 గంటల వరకు వాయిదా పడినప్పటికీ, ఆ తర్వాత గందరగోళం కొనసాగడంతో రోజంతా వాయిదా పడింది. ఈ నేపథ్యం లో రాహుల్ గాంధీ అదానీని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. "చిన్నారోపణలతో ప్రజలను అరెస్టు చేసే కేంద్రం, ఇంత పెద్ద ఆరోపణల విషయంలో ఎందుకు నిశ్శబ్దంగా ఉంది?" అని ప్రశ్నించారు. అదానీ ఈ

మిగతా 2 లో



## ఇస్రో శుక్రయాన్‌కు గ్రీన్ సిగ్నల్

03



02

## నాది బీజేపీ డీఎన్‌ఏ

- ప్రశ్నిస్తే నీ డీఎన్‌ఏ ఏమిటని మాట్లాడుతున్నారు
- ఏడాది పాలనలో కాంగ్రెస్ సాధించింది ఏమీ లేదు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు

## ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్

- సుప్రీం కోర్టులను ఆశ్రయించిన తిరుపతన్న
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు
- విచారణ 18కి వాయిదా



02

# విద్యను సర్కార్ సంక్షోభంలోకి నెట్టింది

### దిలావర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగొచ్చిన రేవంత్ రెడ్డి

- లగచర్లలోనూ తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గిపో
- వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం పడిపోదు
- 30 నుంచి 7 వరకు గురుకుల బాట
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్, రోమింగ్ న్యూస్:** తప్పు ఒప్పుకొని వెనక్కి తగ్గినంత మాత్రాన రేవంత్ రెడ్డి కిరీటం ఏమీ పడిపోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. దిలావ ర్‌పూర్‌లో రైతుల దెబ్బకు దిగొచ్చిన రేవంత్ రెడ్డి లగచర్లలో నూ లెంపలేసుకోవాలని సూచించారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.వెంటనే లగచర్లలో... అల్లుడి కో సం.. అదానీ కోసం.. ఇండస్ట్రియల్ కారిడార్ ముసుగులో పెడుతున్న ఫార్మా, సిమెంట్ ఫ్యాక్టరీల ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమాయకులైన గిరిజనుల భూములను దొంగచాటుగా బలవంతంగా లాక్కునే కుట్రలకు

మిగతా 2 లో





# అధికారులు నిద్రపోతున్నారా?

### చనిపోతే గానీ స్పందించరా!

- వారంలో మూడుసార్లు ఫుడ్ పాయిజన్ జరిగితే ఏం చేస్తున్నట్టు?
- హైకోర్టు ఆదేశిస్తేనే పని చేస్తారా?
- ఫుడ్ శ్యాంపిల్స్ ల్యాబ్‌కు పంపండి
- సోమవారం వరకు నివేదిక ఇవ్వాలని ప్రభుత్వానికి ఆదేశాలు

**హైదరాబాద్, నవంబర్ 27 :** నారాయణపేట జిల్లా మాగనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనపై తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం

మిగతా 2 లో

# రిజర్వేషన్ల కోసమే మత మార్పిడి

- అది రాజ్యాంగాన్ని మోసం చేయడమే
- వారికి కుల ధ్రువీకరణ పత్రాలు అనుమతించం
- మత మార్పిళ్లపై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, రోమింగ్ న్యూస్: మత మార్పిళ్లపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. మతంపై విశ్వాసం లేకుండా కేవలం రిజర్వేషన్ ప్రయోజనాలను పొందేందుకు మత మార్పిడికి పాల్పడడం రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. క్రైస్తవ మతానికి చెందిన ఓ మహిళకు షెడ్యూల్డ్ కుల ధ్రువీకరణ పత్రాన్ని నిరాకరిస్తూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
28 నవంబర్
2024




## ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయండి

### నిర్మల్ జిల్లా కలెక్టర్ ఆదేశాలు



**నిర్మల్, నవంబర్ 27 :** నిర్మల్ జిల్లాలోని ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారం కీలక మలుపు తిరిగింది. ఇథనాల్ ఫ్యాక్టరీ పనులు నిలిపివేయాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ-స్థులతో చర్చించిన కలెక్టర్... ఫ్యాక్టరీ పనులు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంపై సీఎంతో మరోసారి చర్చిస్తామన్నారు. ఇథనాల్ ఫ్యాక్టరీ వ్యవహారంలో కీలక ట్విస్ట్ చోటుచేసుకుంది. రెండు రోజులుగా ఇథనాల్ ఫ్యాక్టరీ రద్దు చేయాలంటూ దిలావర్పూర్ తో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజల తీవ్ర ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ నిరసన స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. నాలుగు గ్రామాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యను తప్పకుండా గుర్తిస్తామని హామీ ఇచ్చారు. మేరకు ఫ్యాక్టరీ పనులు తక్షణమే నిలిపివేయాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. గత ప్రభుత్వం దిలావర్పూర్ గ్రామంలో ఇథనాల్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి గ్రామస్తులు ఆందోళనలు చేస్తూనే ఉన్నారు. ఇటీవల ఫ్యాక్టరీ నిర్మాణ పనులు శరవేగంగా పూర్తి చేస్తుండటంతో.. మంగళవారం గ్రామస్తులు మరోసారి ఫ్యాక్టరీ రద్దు చేయాలని రోడ్డెక్కారు. దాదాపు 10 గంటలకు పైగా పిల్లా పెద్దా అంతా కలసి అర్ధరాత్రి వరక ధర్నాకు దిగారు. గ్రామస్తులకు నచ్చజెప్పడానికి వచ్చిన ఆర్డీవో కళ్యాణిని బంధించారు. ఎట్టకేలకు ఎస్పీ జోక్యం చేసుకొని ఆర్డీవోను వారి నుంచి విడిపించి, పలువురి అరెస్ట్ చేశారు.బుధవారం మరోసారి గ్రామస్తులు ఆందోళనకు దిగారు. మహిళలు పురుగుల మందు డబ్బాలతో రోడ్డు మీదికి వచ్చి అరెస్ట్ చేసిన వారి తక్షణమే విడుదల చేయాలని పట్టు బట్టారు. ఫాక్టరీని రద్దు చేయాలంటూ ఆందోళనకు చేపట్టారు. ఈ వ్యవహారం స్పందించిన కలెక్టర్ అభిలాష అభినవ్ గ్రామస్తులతో చర్చలు చేపట్టారు. అనంతరం ఫ్యాక్టరీ పనులు తక్షణమే నిలిపి వేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమస్య ప్రభుత్వానికి నివేదిక పంపించామని, మరోసారి సీఎంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## బెజ్జూర్‌లో పెద్దపులి కదలికలు

### అప్రమత్తంగా ఉండాలి: అటవీశాఖ అధికారులు



**బెజ్జూర్, నవంబర్ 27:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా బెజ్జూర్ రేంజ్ పరిధిలో సులుగుపల్లి నుంచి జైహింద్ పూర్ వైపు మంగళవారం రాత్రి పులి వెళ్లినట్లుగా గుర్తించినట్టు ఎఫ్ఆర్ఓ ముసవీర్ బుధవారం తెలిపారు. మండలంలోని అడవిలో పులి సంచరిస్తున్నందువల్ల వ్యవసాయ పనులకు వెళ్లేవారు ఒంటరిగా కాకుండా గుంపులుగా వెళ్లాలని సూచించారు. అదే విధంగా అటవీ అవసరాల కోసం అడవిలోకి ఎవరు ప్రవేశించవద్దని హెచ్చరించారు. ప్రస్తుతం పులి సిద్ధప్ప గుహలవైపు ఉన్నట్లుగా సిబ్బంది తెలిపినట్లు ఆయన చెప్పారు.

### సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో

## సీరియల్ కిల్లర్ అరెస్టు

**హైదరాబాద్, నవంబర్27:** దేశవ్యాప్తంగా రైళ్లలో ప్రయాణించి వరుస హత్యలు చేస్తున్న ఓ సీరియల్ కిల్లర్‌ను గుజరాత్‌లోని వల్సాద్ పోలీసులు ఎట్టకేలకు అరెస్టు చేశారు.వల్సాద్ ఎస్పీ డాక్టర్ కరణ్‌రాజ్ సింగ్ వాఘేలా నిందితుడి వివరాలను వెల్లడించారు. భోలో కరమ్‌వీర్ జాట్ అనే ఈ నిందితుడు హర్యానాకు చెందినవాడిగా గుర్తించారు.గతంలో రాజస్థాన్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో అనేక నేరాలకు పాల్పడ్డ అతను ఇటీవల రైల్వేలో సీరియల్ కిల్లర్‌గా మారాడు. 35 రోజుల వ్యవధిలో ఐదు రాష్ట్రాల్లో ఐదు హత్యలు చేసి పోలీసులకు దొరకకుండా తప్పించుకుంటున్నాడు.కరమ్‌వీర్ సాధారణంగా రైళ్లలోని లాస్ట్ భోగీలో ఉండే వికలాంగుల కంపార్ట్‌మెంట్‌లో ఎక్కుతాడు. అక్కడ ప్రయాణికులపై అత్యాచారాలు, హత్యలు, దోపిడీలకు పాల్పడుతుంటారని పోలీసులు తెలిపారు. గత ఆదివారం సికింద్రాబాద్‌లోని ఓ రైలులో వికలాంగుల పెట్టెలో ఒక మహిళ మృతదేహం కనబడింది. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. వల్సాద్ పోలీసులు అందించిన సమాచారంతో సికింద్రాబాద్ జీఆర్పీ అధికారులు నిందితుడి గురించి కీలక ఆధారాలను సేకరించారు. వల్సాద్ పోలీసులు అరెస్టు చేసిన కరమ్‌వీర్‌ను విచారించగా, సికింద్రాబాద్ హత్యను తానే చేసినట్టు ఒప్పుకున్నాడు. ఈ ఘటనలు దేశంలోని రైల్వే భద్రతను ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. సీరియల్ కిల్లర్ కేవలం 35 రోజుల్లో ఐదు హత్యలు చేయడం తీవ్ర ఆందోళన కలిగించింది.

# లోక్‌సభలో రచ్చరచ్చ


మొదటి పేజీ తరువాయి


ఆరోపణలను అంగీకరిస్తాడని ప్రభుత్వం నమ్ముతుందా అని ఆయన సూటిగా ప్రశ్నించారు.లంచాల ఆరోపణలపై ప్రభుత్వం ఎలా స్పదింస్తుందో అని ప్రజలు ఎదురు చూస్తున్నారని పేర్కొన్నారు.ఇక బీజేపీ ఎంపీ మహేష్ జెఠ్మలానీ మాత్రం ఈ వ్యవహారంపై కాంగ్రెస్‌ను విమర్శించారు.రాజకీయ లబ్ధి కోసమే కాంగ్రెస్ ఈ అంశాన్ని పెద్దది చేస్తోందని పేర్కొన్నారు. "భారత గ్రోత్ స్టోరీని అడ్డుకోవడమే యూఎస్ ఆరోపణల ఉద్దేశం," అని ఆయన అన్నారు. అదానీ గ్రూప్ కాంట్రాక్టులు పొందడంలో భారత శత్రు దేశాలను కూడా దాటగలిగిందని అభిప్రాయపడ్డారు. మరోవైపు ఏపీలో సోషల్ మీడియా పోస్టులపై ప్రకంపనలు కొనసాగుతున్నాయి. సోషల్ మీడియాలో కించపర్చేలా పోస్టులు పెట్టారంటూ ఇప్పటికే అనేక మందిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోషల్ మీడియాలో విపరీత ధోరణులు కనిపిస్తున్నాయని.. నాయకులను, మహిళలను కించపరుస్తూ పోస్టులు పెడుతున్నారని సీఎం చంద్రబాబు నాయుడు సైతం పలుమార్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులు పెట్టే వాళ్లను వదిలిపెట్టబోమని హెచ్చరించారు. సోషల్ మీడియాలో మహిళలను వేధిస్తున్న వారిని ఎలా నియంత్రించాలనే అంశంపై చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఇలా



సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై తెలుగు రాష్ట్రాల్లోనే కాదు.. దేశవ్యాప్తంగా ఇదేరకమైన వ్యతిరేకత, ఆగ్రహం వ్యక్తం అవుతున్నాయి. ఈ క్రమంలో.. సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టుల వ్యవహారంపై కేంద్రం ప్రభుత్వం లోక్‌సభ వేదికగా కీలక ప్రకటన చేసింది.. అలాంటి వాళ్ల సంగతి చూస్తామంటూ పేర్కొంది. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై సీరియస్ అయిన కేంద్రం.. అసభ్య కంటెంట్ నియంత్రించడానికి కఠిన చట్టం తెస్తామని కేంద్రం తెలిపింది. సోషల్ మీడియాలో అసభ్యకరమైన కంటెంట్‌ను తనిఖీ చేసేలా చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉందని కేంద్ర సమాచార, ప్రసారాల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ అంశంపై స్టాండింగ్ కమిటీ దృష్టిపెడుతుందని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మనకు, విదేశాలకు సంస్కృతుల్లో చాలా తేడా ఉందని చెప్పారు.. సోషల్ మీడియాలో అసభ్య పోస్టులపై.. ప్రశ్నోత్తరాల్లో ఎంపీ అరుణ్ గోవిల్ ప్రశ్నకు అశ్వినీ వైష్ణవ్ ఈ విధంగా జవాబు చెప్పారు. దినపత్రికలు, మీడియా సంస్థల్లో ఎడిటోరియల్ కంటెంట్‌ను తనిఖీ చేయడానికి ప్రత్యేకంగా ఎడిటోరియల్ వ్యవస్థ ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏవైనా తప్పులు దొర్లితే దాన్ని సరి చేస్తారని.. సోషల్ మీడియాలో మాత్రం అలాంటి వ్యవస్థ ఏదీ లేదంటూ తెలిపారు. యూజర్లు మీడియాకు మించి స్వేచ్ఛగా వ్యవహరిస్తోన్నారని, ఫలితంగా అనేక రకాల అసభ్యకరమైన కంటెంట్ పోస్ట్ అవుతోందని తెలిపారు. ఈ సమస్యను పార్లమెంటు స్టాండింగ్ కమిటీ టేకప్ చేస్తుందని.. కఠినమైన చట్టాలను రూపొందించాలని తాను కోరుకుంటున్నానని అశ్విని వైష్ణవ్ తెలిపారు. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో అసభ్యకరమైన కంటెంట్‌ను అరికట్టడానికి ప్రస్తుత చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ నొక్కిచెప్పారు.

## తెలంగాణపై మోడీ ప్రత్యేక ఫోకస్


మొదటి పేజీ తరువాయి


మూడు అంశాలపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దాదాపు అరగంట పాటు ఈ చర్చ కొనసాగినట్లు సమాచారం. ఈ భేటీలో ప్రధానంగా రాష్ట్ర రాజకీయాలపై ఆరా తీసినట్లు తెలిసింది. తెలంగాణలో బీజేపీ పరిస్థితి, అలాగే రాష్ట్ర ప్రభుత్వంపై ప్రజల్లో ఎలాంటి ఒపీనియన్ ఉందని వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. త్వరలో తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్నాయి. దానిపై సైతం శానిర్దేశం చేసినట్లు తెలిసింది. ఇలా ఉండగా తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడా పూర్తిచేసుకోనున్న సందర్భంగా ప్రజా పాలన విజయోత్సవాలను నిర్వహించనుంది. కాగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించడంపై బీజేపీ కార్యాచరణ ఏంటనే అంశాలపై ప్రస్తావించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీజేపీ చేపట్టనున్న ప్రణాళికను ఎమ్మెల్యేలు, ఎంపీలు మోడీకి వివరించినట్లు తెలిసిం. కాగా జనాలకు అర్థమయ్యే తీరులో తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేసినట్లు సమాచారం. అలాగే బీజేపీలో సంస్థాగత ఎన్నికలు కొనసాగుతున్నాయి. ఈ తరుణంలో ఎవరిని స్టేట్ చీఫ్ గా చేస్తే బాగుటుందనే అంశంపైనా చర్చించినట్లు సమాచారం. ఎవరికి బాధ్యతలు అప్పగిస్తే బాగుటుందనే అంశంపై ఎమ్మెల్యేలు, ఎంపీల ఒపీనియన్ అడిగి తెలుసుకున్నట్లు సమాచారం. వాటితో పాటు నియోజకవర్గాల్లో అభివృద్ధి అంశాలపైనా చర్చించినట్లు టాక్. తెలంగాణలో ఉన్న అనుకూల వాతావరణాన్ని క్యాష్ చేసుకోవాలని ప్రధాని మోడీ దిశానిర్దేశం చేసినట్లు వినికిడి. ప్రధాని మోడీతో సమావేశం అనంతరం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నివాసంలో తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సునీల్ బన్సల్ కీలక సమావేశం నిర్వహించారు. పార్టీ సంస్థాగత ఎన్నికల వేళ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్మేల్యు హుటాహుటిన ఢిల్లీకి వెళ్లడం, వరుసగా సమావేశాలు నిర్వహించడం ప్రాధాన్యత సంతరించుకుంది. త్వరలో తెలంలగాణలో జరగబోయే ఎన్నికలపై బన్సల్ బన్సల్ సమావేశం నిర్వహించినట్లు వినికిడి. ఇదిలా ఉండగా ఉన్న పళంగా ఎమ్మెల్యేలు, ఎంపీలు ఢిల్లీకి వెళ్లడంపై ప్రశ్నించగా కేవలం క్యాజువల్, కర్టసీ మీటింగ్ అని చెప్పడం గమనార్హం. బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మినహా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఎమ్మెల్సీ హస్తినకు వెళ్లారు. అనివార్య కారణాల వల్ల మహేశ్వర్ రెడ్డి హాజరవ్వలేదని సమాచారం.

### కాంగ్రెస్‌తో విసిగిపోయారు : ఎక్స్‌లో మోడీ

తెలంగాణ బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశం అనంతరం ప్రధాని మోడీ ఎక్స్ వేదికగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పై ఘాటు విమర్శలు చేశారు. తెలంగాణలో బీజేపీ ఉనికి వేగంగా విస్తరిస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌తో విసిగిపోయారని మండిపడ్డారు. బీఆర్ఎస్ దుష్టపాలన వల్ల కలిగిన భయంకరమైన జ్ఞాపకాలతో ఉన్నారని పోస్ట్ చేశారు. అందుకే యావత్ తెలంగాణ ప్రజలు ఆశతో బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బీజేపీ తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూనే ఉంటుందని నొక్కి చెప్పారు. తమ కార్యకర్తలు అభివృద్ధి ఎజెండాను వివరిస్తూనే ఉంటారని స్పష్టంచేశారు. కాగా తెలంగాణ బీజేపీ శాసనసభ్యులు, ఎంపీలతో చాలా మంచి సమావేశం జరిగినట్లుగా మోడీ చెప్పుకొచ్చారు.

## నాది బీజేపీ డీఎన్ఏ

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శలు



**హైదరాబాద్, నవంబర్ 27 :** తెలంగాణలో ఏడాది పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం సాధించింది ఏమీ లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి విమర్శించారు. బెదిరింపులు, తిట్ల పురాణాలు తప్ప ఏమీ సాధించలేదని అన్నారు. సమస్యలపై మాట్లాడితే నీ డీఎన్ఏ ఏమిటని మాట్లాడుతున్నారని... తన డీఎన్ఏ భారతీయ జనతా పార్టీ అని చెప్పారు. మిగిలిన వారి మాదిరి 10 పార్టీలు మారిన డీఎన్ఏ తనది కాదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను డిసెంబర్ 1 నుంచి 5 వరకు ప్రజలకు వివరిస్తామని తెలిపారు. రాజకీయ పార్టీల ఆరోపణలు, ప్రత్యారోపణలతో రాష్ట్రం నష్టపోతుందని చెప్పారు. రాష్ట్రంలో రాజకీయ వ్యవస్థ భ్రష్టుపడుతోందని... కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా నిర్మాణాత్మక పాలనపై దృష్టి సారించాలని హితవు పలికారు.

## రోప్‌వే ప్రాజెక్టుపై ఆందోళన

**శ్రీనగర్, నవంబర్ 27 :** జమ్మూకశ్మీర్‌లోని కాట్రా బేస్ క్యాంప్ వద్ద రోప్‌వే ప్రాజెక్టును చేపట్టాలని నిర్ణయించారు. ట్రెక్కింగ్ రూట్‌లో ఆ రోప్‌వే నిర్మించాలనుకున్నారు. కానీ రియాజీ జిల్లాకు చెందిన కార్మికులు, షాపు ఓనర్లు.. ఆ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. ఈ ఘటనపై పోలీసులు 8 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. భూపిందర్ సింగ్, సోహన్ చాంద్ నేతృత్వంలోని ఆందోళనకారులు.. ప్రతిపాదిత రోప్‌వే ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించారు. అయితే వాళ్లను పోలీసులు అడ్డుకోవడంతో.. ఘర్షణలు తలెత్తాయి. సింగ్, చాంద్‌ను అరెస్టు చేశారు. సోమవారం జరిగిన ఘర్షణకు చెందిన ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో ప్రదర్శన చేపట్టారు.




## అధికారులు నిద్రపోతున్నారా?


మొదటి పేజీ తరువాయి


చేసింది. అధికారులు నిద్రపోతున్నారా? అంటూ తీవ్రంగా స్పందించింది. వారంలో మూడుసార్లు ఫుడ్ పాయిజనింగ్ జరిగితే అధికారులు ఏం చేస్తున్నారని నిలదీసింది. స్కూల్‌లో ఫుడ్ పాయిజనింగ్ చాలా సీరియస్ అంశమని సీజే జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. పిల్లలు చనిపోతే గానీ స్పందించరా? అంటూ హైకోర్టు ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఘటన నిదర్శనమని.. ప్రభుత్వం ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకోవడం లేదంటూ తలంటింది. ఘటనపై వారంలోగా కౌంటర్ దాఖలు చేస్తామని ప్రభుత్వం తరఫున న్యాయవాది హైకోర్టుకు తెలుపగా.. ఆగ్రహం వ్యక్తం చేసింది. వివరాల సేకరణకు వారం సమయం ఎందుకని నిలదీసింది. హైకోర్టు ఆదేశిస్తేనే అధికారులు పని చేస్తారా? అని నిలదీసింది. నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేస్తే ఐదు నిమిషాల్లో హాజరవుతారని హైకోర్టు చెప్పింది. అధికారులకు కూడా పిల్లలున్నారని.. మానవతా దృక్పథంతో వ్యవహరించాలని సూచించింది. భోజనం వికటించిన పాఠశాలల్లో శ్యాంపిల్స్ సేకరించిన ల్యాబ్‌కు పంపాలని ఆదేశించింది. సోమవారం వరకు నివేదిక అందించాలని ప్రభుత్వానికి సూచించింది. అలాగే అధికారులపై ఏం చర్యలు తీసుకున్నారో తెలుపాలని చెప్పింది. ఘటనపై భోజన విరామం తర్వాత పూర్తి వివరాలు అందజేస్తామని ఏఏజీ కోర్టుకు తెలిపారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని హైకోర్టులో పిల్ దాఖలైంది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో తరుచూ భోజనం వికటిస్తుందని ప్రభాకర్ హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నారాయణపేట జిల్లా మాగనూరు జడ్పీ పాఠశాలలో మంగళవారం ఫుడ్ పాయిజనింగ్ జరిగిన విషయం తెలిసిందే. పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసిన పిల్లలు అస్వస్థతకు గురయ్యారు. దాదాపు 30 మంది విద్యార్థులు వాంతులు, తలనొప్పి, కడుపు నొప్పితో బాధపడగా.. వెంటనే వారిని మక్తల్ ఆసుపత్రికి తరలించారు. పాఠశాలలో వారం వ్యవధిలోనే మరోసారి ఫుడ్ పాయిజనింగ్ జరిగింది. ఇంతకు ముందు 20న ఫుడ్ పాయిజనింగ్ కారణంగా వంద మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనలో చౌదరి శైలజ అనే విద్యార్థి పరిస్థితి విషమించి.. చివరకు చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విధితమే. శైలజకు అక్టోబర్ 30న పాఠశాలలో వాంతులు విరేచనాలు కావడంతో వాంకిడి వైద్యశాలలో చికిత్స అందించారు. పరిస్థితి విష మించడంతో నిమ్స్‌కు తరలించారు. దాదాపు 20 రోజులుగా చికిత్సపొందిన విద్యార్థిని సోమవారం తుదిశ్వాస విడిచింది.

## రిజర్వేషన్ల కోసమే మత మార్పిడి


మొదటి పేజీ తరువాయి


తీర్పును సమర్థించింది. కేవలం రిజర్వేషన్ ప్రయోజనాల కోసం నమ్మకం లేకపోయినా మతం మార్చుకోవడాన్ని సుప్రీం కోర్టు అనుమతించదని జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ ఆర్ మహదేవన్ బెంచ్? పేర్కొంది. ఇలా చేయడం కోటా విధానం ప్రాథమిక, సామాజిక లక్ష్యాలను బలహీనపరిచినట్లే అవుతుంద ని తెలిపింది. అలా చేయడం బలహీన వర్గాల కోసం ఉద్దేశించి న రిజర్వేషన్ల విధానాల స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని, అది రాజ్యాంగాన్ని మోసం చేయడమే అవుతుందని అభిప్రాయపడిం ది. హిందూ తండ్రికి, క్రైస్తవ తల్లికి పుట్టిన సెల్వరాణి అనే ఓ మహిళ క్రైస్తవురాలిగా బాప్టిజం తీసుకుంది. ఆ తర్వాత తాను హిందువుగా ప్రకటించుకుంది. 2015లో పుదుచ్చేరిలోని అప్ప ర్? డివిజన్ కర్క్ పోస్ట్?కు దరఖాస్తు చేసుకునేందుకు ఎస్?సీ సర్టిఫికెట్? ఇవ్వాలని హైకోర్టును ఆశ్రయించింది. తాను హిందూ మతాన్ని ఆచరిస్తున్నానని, అందుకే ఎస్?సీ సర్టిఫికెట్ కావాలని కోరింది. విచారణ చేపట్టిన హైకోర్టు కుల ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు నిరాకరించి. దీనిపై సుప్రీం కోర్టులో సవాల్ చేయగా హైకోర్టును తీర్పును సమర్థించింది. పిటిషనర్? క్రైస్తవ మతాన్ని ఆచరిస్తూనే ఉన్నారని, ఆమె తిరిగి హిందూ మతంలోకి మారినట్లు ఎటువంటి ఆధారాలు లేవని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పిటిషనర్ తండ్రి షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తి అయిన తర్వాత క్రిస్టియన్?గా మతం మార్చినట్లు డాక్యుమెం



టరీ ఆధారాల ద్వారా స్పష్టమైనట్లు న్యాయస్థానం తెలిపింది. పిటిషన్?రకు వ్యతిరేకంగానే సాక్ష్యాలు ఉన్నాయని, కేవలం రిజర్వేషన్? ప్రయోజనాల కోసమే మత మార్పిడి చేసుకున్న ట్లుగా అర్థమవుతుందని పేర్కొంది. అందుకే కుల ధ్రువీకరణ పత్రాన్ని ఇచ్చేందుకు అనుమతించమని సుప్రీం కోర్టు తీర్పులో పేర్కొంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

గురువారం
28 నవంబర్
2024





# కాంగ్రెస్ మంత్రులంతా పనిమంతులే!

- పదేళ్లు ఇంట్లో పడుకొని ఇప్పుడు విమర్శలా?
- రేవంత్ పార్టీ లైన్‌లోనే పని చేస్తున్నారు
- మాతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారు
- కేటీఆర్‌భ్రమలో బతుకుతున్నాడు
- కాంగ్రెస్ అంతం బీఆర్ఎస్‌తరం కాదు
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్, నవంబర్27:** కాంగ్రెస్ పార్టీని అంతం చేయడం బీఆర్ఎస్ తరం కాదని, కేటీఆర్ భ్రమల్లో బతుకు తున్నాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మండిప డ్డారు. ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా తమతో టచ్‌లో ఉన్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం గాంధీభవన్‌లో పీసీసీ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ తో కలిసి ఆయన మీడియాతో చిట్‌చాట్ చేశారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ గ్రాఫ్ పెరుగుతున్నదన్నారు. రైతు భరోసా విధి విధానాల కసరత్తు జరుగుతున్నదని, రైతు భరోసా ఉంటుందని చెప్పారు. గత కొద్ది రోజులుగా కేటీఆర్ ఏం మాట్లాడుతున్నారో.. ఎందుకు మాట్లాడుతున్నారో.. అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. సంక్షేమ, గురుకుల వసతి గృహాల్లో సంఘటనలపై ప్రభుత్వం సీరియస్ గా ఉందని చెప్పారు. కాంగ్రెస్ మంత్రులంతా పనిమంతులేనని స్పష్టం చేశారు. ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉందని, సంక్షేమం, అభివృద్ధి, ప్రగతిశీల భావాలే లక్ష్యంగా ముందుకెళ్తున్నామ ని చెప్పారు. అలాగే, అసైన్డ్ భూముల వివరాలు సేకరిస్తు న్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్‌ను కూకటివేళ్లతో పెకిలిస్తా మన్న కేటీఆర్ వ్యాఖ్యలకు గట్టి కౌంటర్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఫిరాయింపులను స్వతహాగా ప్రోత్సహించడం లేదని, వాళ్ల పార్టీలో వారే వేరే గ్రూప్ ఉన్నారని పేర్కొన్నారు. సిరిసిల్ల కలెక్టర్‌ను తిడుతున్నారంటే అంటే.. ఆయన మైండ్సెట్ అర్థం అవుతోందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పార్టీ లైన్ లోనే పని చేస్తున్నారని, ప్రభుత్వం ప్రోగ్రెసివ్ థింకింగ్, వెల్ఫేర్, డెవలప్‌మెంట్‌అనే మూడు అంశాలతో ముందుకు వెళ్తున్నదని తెలిపారు. ఫ్యూడల్ వ్యవస్థను తిరిగి తేవడం తప్ప బీఆర్ఎస్ వాళ్లు చేసిందేమీ లేదని భట్టి విమర్శించారు.

### కేసీఆర్‌అసెంబ్లీకి రావాలని ఆశిస్తున్నా..

కేసీఆర్ అసెంబ్లీకి వచ్చి తన రోల్ ప్లే చేయాలని ఆశిస్తున్నానని భట్టి చెప్పారు. రాష్ట్ర కేబినెట్ లో మంత్రుల మధ్య అభిప్రాయ భేదాలు లేవని, సమిష్టిగా నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి అంశాన్ని డైలీ సీరియల్ లాగా చేసుకొని బీఆర్ఎస్ వాళ్లు బతకాలని చూశారని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా వాళ్లగాలే ఉంటుందని అనుకుంటున్నారని కానీ తాము ఫోకస్డ్ గా ముందుకు వెళ్తున్నామన్నారు.

### స్థానిక ఎన్నికలపై త్వరలోనే నిర్ణయం

స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించాలనేది త్వరలో చర్చిస్తామని భట్టి తెలిపారు. ఇచ్చిన హామీల్లో వందరోజుల్లో చేయాల్సినవి చేశామని మిగతావి కూడా చేస్తూ ముందుకు వెళ్తామని వెల్లడించారు. పదేళ్లు రేషన్ కార్డులు ఇవ్వకుండా ఇంట్లో పడుకున్న బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు విమర్శలు చేస్తున్నారని భట్టి మండిపడ్డారు. అందరు సమానంగా ఎదిగారా? అనేది కులగణన సర్వేతో తేలుతుందని, నివేదిక వచ్చాక చర్చ చేసి ఏది మంచో అది చేస్తామని ప్రకటించారు. ఢిల్లీ పర్యటనల ద్వారా కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చామో త్వరలో చెబుతామని భట్టి చెప్పారు. ఇథనాల్ కంపెనీపై స్టడీ చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు.

### క్రిస్మస్‌వేడుకలపై సమీక్ష

రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే క్రిస్మస్ వేడుకల నిర్వహణపై ప్రజాభవన్‌లో సెలబ్రేషన్ కమిటీ సభ్యులు, అధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు సమీక్షించారు. దీనికి ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దీపక్ జాన్, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్, ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి తఫ్సీర్ ఎక్బాల్, జీఏడీ డైరెక్టర్ ఎస్ వెంకట్రావు, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కాంతి వెస్లీ, మాజీ ఎమ్మెల్యే క్రిష్టైన్ లాజరస్, తెలంగాణ క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ సబిత తదితరులు హాజరయ్యారు.



# ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో ట్విస్ట్

- సుప్రీం కోర్టులను ఆశ్రయించిన తిరుపతన్న
- హైకోర్టు తీర్పుపై ఆశ్రయించిన పోలీసు అధికారి
- కేసుపై విచారణ చేపట్టిన ధర్మాసనం
- కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి రెండు వారాల గడువు
- తదుపరి విచారణ డిసెంబర్18కి వాయిదా

**న్యూఢిల్లీ, నవంబర్ 27 :** తెలంగాణ రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్ కేసు ఎంతటి దుమారాన్ని రేపిందో అందరికీ తెలిసిందే. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీసు అధికారులు బెయిల్ కోసం విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అయితే వారికి ప్రతీసారీ నిరాశే మిగులుతోంది. ఈ కేసులో అరెస్ట్ అయిన పోలీస్ అధికారి తిరుపతన్న తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో బెయిల్ కోసం అదనపు ఎస్పీ తిరుపతన్న సుప్రీం కోర్టులో వేసిన పిటిషన్‌పై బుధవారం విచారణ జరిగింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సమయం కోరింది. దీంతో జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్ సింగ్‌ల ధర్మాసనం కౌంటర్ దాఖలుకు రెండు వారాల సమయం ఇస్తూ.. తదుపరి విచారణ డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా ఫోన్ ట్యాపింగ్ కేసులో అదనపు ఎస్పీ తిరుపతన్నను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. బెయిల్ కోసం హైకోర్టులో పిటిషన్ వేయగా.. అందుకు న్యాయస్థానం అంగీకరించలేదు. తిరపతన్నకు బెయిల్ రద్దు చేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అయితే హైకోర్టు బెయిల్ రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ ఆయన సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై గురువారం (అక్టోబర్ 24న) న్యాయస్థానం విచారణ చేసింది. జస్టిస్ బీవీ నాగరత్న , జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీం కోర్టు నోటీసులు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఛార్జ్‌షీట్ ఫైల్ చేసి మూడు నెలలు అయిన తర్వాత కూడా హైకోర్టు బెయిల్ ఎందుకు నిరాకరించిందని ధర్మాసనం ప్రశ్నిస్తూ.. తరుపరి విచారణను నవంబర్ 27కు వాయిదా వేసింది. ఈరోజు విచారణ జరిపిన సుప్రీం కోర్టు తదుపరి డిసెంబర్ 18వ తేదీకి వాయిదా వేసింది. కాగా.. ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న తిరుపతన్నకు ఇటీవల హైకోర్టు బెయిల్ రద్దు చేసిన విషయం తెలిసిందే. తిరుపతన్న దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌ను న్యాయస్థానం నిరాకరించింది. తిరుపతన్న ఫోన్ ట్యాపింగ్ చేసినట్లు ఆధారాలు ఉన్న నేపథ్యంలో బెయిల్ ఇవ్వలేమని స్పష్టం చేసింది. కేసు విచారణ కీలక దశలో ఉన్న సమయంలో బెయిల్ ఇస్తే... దాన్ని వల్ల దర్యాప్తుపై ప్రభావం పడే అవకాశం ఉంటుందని హైకోర్టుకు పోలీసులు తెలియజేశారు. పోలీసుల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. ఫోరెన్సిక్ ల్యాబరేటరీ నివేదిక ప్రకారం దర్యాప్తు చేయాలని ఖాకీలను కోర్టు ఆదేశించింది. అలాగే తిరుపతన్నకు బెయిల్ మంజూరు చేయలేమని స్పష్టం చేస్తూ.. ఈ కేసును హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైకోర్టును తీర్పును సవాల్ చేస్తూ తిరుపతన్న సుప్రీంను ఆశ్రయించారు.

# నిర్బంధాలతో ఉద్యమాలు ఆగుతాయా?

- ప్రజాపాలన అంటే నిర్బంధాలా?
- కాంగ్రెస్ పాలనను ప్రశ్నించిన ఎమ్మెల్సీ కవిత

**హైదరాబాద్, నవంబర్ 27 :** ప్రజాపాలన అంటూ చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం నిర్బంధాలతో పాలన సాగిస్తుందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మాగునూరు జెడ్పీ హైస్కూల్‌లో వరుస ఫుడ్ పాయిజన్ ఘటనలపై బీఆర్ఎస్ నేతలు ప్రశ్నిస్తారని, ప్రజలతో కలిసి ఉద్యమిస్తారనే భయంతో తెల్లవారుజామునే అక్రమ అరెస్టులకు తెరలేపింది కాంగ్రెస్ సర్కార్ అంటూ ధ్వజమెత్తారు. ప్రజా పాలను అంటూ గొప్పలు చెప్పుకుంటున్న కాంగ్రెస్ పెద్దలు, ప్రజలు నిలదీస్తారనే భయంతో బీఆర్ఎస్ నేతలు, ప్రజలను నిర్బందిస్తూ, తెలంగాణ ఉద్యమం నాటి సమైక్య రాష్ట్ర ప్రభుత్వ అణిచివేతలను తలపిస్తున్నాయన్నారు. బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాం మోహన్ రెడ్డి, కార్యకర్తల ముందస్తు అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈ క్రమంలో మక్తల్ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

# విద్యను సర్కార్ సంక్షోభంలోకి నెట్టింది

మొదటి పేజీ తరువాయి



ఇప్పటికైనా తెరదించాలని పేర్కొన్నారు. అక్కడ శాంతిని నెలకొల్పాల్సి ఉందన్నారు. ఢిల్లీలో రైతుల సంఘటన శక్తిలో ఉన్న బలం ముందు దేశ ప్రధాని కూడా చివరికి వెనక్కి తగ్గిన చరిత్ర మన కళ్ళ ముందు ఉందని కేటీఆర్ రాసుకొచ్చారు. అనాలోచిత నిర్ణయాలతో మొన్న లగచర్లలో లడాయికి కారణమైన రేవంత్ రెడ్డి.. తన మొం డి వైఖరి వల్లే నిన్న నిర్మల్‌లో ఇథనాల్ మంటలను రాజేశారని ఆరోపించారు. తలకు మాసిన ఆలోచనలతో రేపు రేవంత్ ఏ జిల్లాలోని... ఏ పచ్చని పంట పొలాల్లో ఎలాంటి బాంబు పేలుస్తారోననే భయం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరిలో వ్యక్తమవుతోందన్నారు. ప్రజల అభీష్టం మేరకు నడుచుకోవడం.. వారి మనోభావాలను గౌరవించ డమనేది పాలకుడి ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని గుర్తెరిగి వెంటనే నిర్మల్ తరహాలోనే... సొంత నియోజకవర్గంలో లగచర్ల సమరానికి ఫుల్ స్టాప్ పెట్టాలని హితవు పలికారు. లేదంటే జరిగే పరిణామాలకు సీఎం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. నవం బర్ 30 నుంచి డిసెంబర్ 7 వరకు రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ ఎస్ గురుకుల బాట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడించారు. గురుకుల బాట కార్యక్రమంలో భాగంగా గురుకులాలు, కేజీబీవీలు, మోడల్ స్కూల్స్, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కాలేజీలను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు పరిశీలిస్తారు. గురుకుల, పాఠశాల విద్యను రేవంత్ రెడ్డి ప్రభుత్వం సంక్షోభంలోకి నెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. 11 నెలల్లో 52 మంది విద్యార్థుల మృతి చెందారని, ఇందులో 38 ఫుడ్ పాయిజన్ సంఘటనలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలన గాలికొదిలేసి నేరపూరిత నిర్లక్ష్యంతో ఈ ముఖ్యమంత్రి విద్యార్థులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. రాష్ట్రానికి కనీసం విద్యాశాఖ మంత్రి లేడన్నారు. అయినా సీఎం ఢిల్లీకి తిరిగేందుకే సమయం సరిపోవడం లేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులు చనిపోతున్నప్పటికీ ఒక్క సమీక్ష నిర్వహించని ప్రభుత్వానికి ఉసురు తప్పదని హెచ్చరించారు. గురుకులాలు, కేజీబీవీ, మోడల్ స్కూళ్ల పరిస్థితులను అధ్యయనం చేసేందుకు బీఆర్ఎస్ తరఫున అధ్యయన కమిటీ వేస్తున్నామన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో గురుకుల అధ్యయన కమిటీ వేస్తున్నట్లు తెలిపారు. గురుకులాలను పరిశీలించి ఈ కమిటీ నివేదిక ఇస్తుందన్నారు. ఈ అంశాలను తాము అసెంబ్లీలో లేవనెత్తుతామన్నారు.

# పోలీసుల అత్యుత్సాహం

## మక్తల్‌లో బీఆర్ఎస్ నేతలను అరెస్టు



**హైదరాబాద్, నవంబర్ 27:** మక్తల్‌లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. మాగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సందర్శనకు వెళ్తారనే అనుమానంతో బుధవారం తెల్లవారు జామున మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డితో పాటు పలువురు బీఆర్ఎస్ నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసులు నియోజకవర్గవ్యాప్తంగా వివిధ మండలాలకు చెందిన నేతలను అరెస్టు చేసి జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డిని మద్దూర్ పోలీస్ స్టేషన్‌కు నారాయణపేట పోలీసులు తరలించారు. మాగనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఫుడ్ ఫాయిజన్‌తో విద్యార్థులు అవస్థతకు గురయ్యారు. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు మద్దతుగా బీఆర్ఎస్ నేతలు ఆందోళన నిర్వహించే అవకాశం ఉందనే అనుమానంతో బుధవారం తెల్లవారు నుంచే పోలీసులు అరెస్టులకు దిగారు. అరెస్టు చేసిన నాయకులను జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలిస్తున్నారు. మాగనూరులో నిరసనలు, ఆందోళనలు జరుగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా డీఎస్పీ లింగయ్య నేతృత్వంలో భారీగా పోలీసులను మోహరించారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డి అక్రమ అరెస్టు నిరసిస్తూ బీఆర్ఎస్ నేతలు మక్తల్ జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. వారిని పోలీసులు బలవంతంగా పోలీసులు అరెస్టు చేసి.. ఠాణాకు తరలించారు. పోలీసుల అత్యుత్సాహంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# ఇస్రో శుక్రయాన్‌కు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, నవంబర్ 27 :** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ కీలకమైన మిషన్లు చేపట్టబోతున్నది. వీనస్‌తో పాటు గగన్‌యాన్, చంద్రయాన్-3 ప్రాజెక్టులకు సిద్ధమ వుతున్నది. 2028లో ఇస్రో శుక్రయాన్ మిషన్ ప్రయోగిం చనుండగా.. ఈ ప్రాజెక్టుకు కేంద్రం ఆమోదం తెలిపిందని ఇస్రో డైరెక్టర్ నీలేశ్ దేశాయ్ తెలిపారు. సింథటిక్ ఎపర్చర్ రాడార్, అల్ట్రావైలెట్ ఇమేజింగ్ సిస్టమ్ తదితర అత్యాధునిక టెక్నాలజీతో కూడిన పరికరాలతో శుక్రుడి వాతావరణంపై పరిశోధన జరుపనున్నది. దట్టమైన కార్బన్‌డయాక్సైడ్, సల్ఫ్యూరిక్ ఆమ్లం, క్రియాశీల అగ్నిపర్వతాలను గుర్తించడంతో పాటు గ్రహం భౌగోళిక కార్యకలాపాలను అంచనా వేయడం మిషన్ ముఖ్య లక్ష్యాల్లో ఒకటి. చంద్రయాన్-3 విజయం తర్వాత.. జపాన్‌తో కలిసి చంద్రయాన్-4 ఇస్రో చేపట్టనున్నది. ఈ ప్రాజెక్టులో చంద్రుడిపై మట్టి, రాతి నమూనాలను సేకరించి తిరిగి భూమిపైకి చేరుకునేలా ప్రయోగం చేపట్టబోతున్నది. ఈ మిషన్‌కు కేంద్రం ఆమోదం తెలిపి తే.. 2030 నాటికి మిషన్‌ను నిర్వహించగలుగ నున్నట్లు నీలేశ్ దేశాయ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మిషన్ శాస్త్రీయ ప్రాముఖ్యతను వివరించారు. మార్స్ ఆర్బిటర్ మిషన్ (మంగళ్‌యాన్) సాధించిన విజయాల ఆధారంగా ఇస్రో మార్స్ ప్రోగ్రామ్‌ను సైతం విస్తరిస్తున్నది. రాబోయే దశలో రెడ్ ప్లానెట్ చుట్టూ పరిభ్రమించడంతో పాటు ఉపరితలంపై ల్యాండింగ్‌కు ప్రయత్నించనున్నట్లు పేర్కొన్నారు. మార్స్ మిషన్‌లో ఓ ఉపగ్రహాన్ని అంగారకుడి కక్ష్యలో ఉంచడంతో పాటు ఉపరితలంపై ల్యాండింగ్‌కు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఆ గ్రహంపై మరింత లోతుగా అధ్యయనం చేస్తామన్నారు. అలాగే, గగన్‌యాన్‌లో కీలకమైన మైలురాయిని చేరుకునేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిపారు. తొలిసారిగా గగన్‌యాన్ ప్రాజెక్టులో భాగంగా ఆస్ట్రోనాట్స్‌ని అంతరిక్షంలోకి తీసుకువెళ్లనున్నది. రాబోయే రెండేళ్లలో మిషన్ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4ని భాగంగా వాతావరణ, సముద్రంపై పరిశోధనలను మెరుగుపరిచేందుకు కొత్త సెన్సార్లతు ఉపగ్రహాలను సిద్ధం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇన్‌శాట్-4 సిరీస్‌లో భాగంగా ప్రయోగించనున్న కొత్త సెన్సార్లు, ఉపగ్రహాలపై చర్చలు జరుపుతున్నామన్నారు. ఇక తొలిసారిగా అంతరిక్ష కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన ప్రణాళికలకు సైతం కేంద్రం ఆమోదం తెలిపింది. ఇది ఐఎస్ఎస్ కంటే చిన్నగా ఉంటుంది. ఇస్రో స్పేస్ సెంటర్‌లో ఐదు మాడ్యూల్స్ ఉంటాయి. తొలి మాడ్యూల్ 2028లో ప్రారంభించనున్నారు. పూర్తి స్టేషన్ నిర్మాణం 2035 నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.

# సరిహద్దులు గుర్తించే వరకు నిర్మాణాలు చేయకండి..

## హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, నవంబర్27 :** కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి రెవెన్యూ సరిహద్దుల్లో ఉన్న ఈదుల కుంటను సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులను హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. ఖానామెట్ పరిధిలోని ఈదులకుంట చెరువును బుధవారం రెవెన్యూ అధికారులతో కలిసి ఆయన మరోసారి పరిశీలించారు. కొంతకాలంగా పత్రికల్లో వచ్చిన కథనాలు, సీపీఎం నాయకుల ఫిర్యాదుల నేపథ్యంలో పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఖానామెట్ విలేజ్ లో 6.5 గుంటల విస్తీర్ణంలో విస్తరించి ఉన్న ఈదులకుంట చెరువు శిఖాన్ని పూడ్చివేసి కొంతమంది బిల్డర్లు నిర్మాణాలు చేపడుతున్నట్లు గుర్తించారు. చెరువులోకి వర్షం నీటిని మోసుకువచ్చే నాలాను దారి మళ్లించి బిల్డర్లు కబ్జా చేసినట్లు తెలుసుకున్నారు. పక్కన ఉన్న పట్ట భూమి సర్వే నెంబర్ తో డాక్యుమెంట్ సృష్టించి చెరువులో అనుమతులు తీసుకున్నారని.. అక్రమ అనుమతులతో బిల్డర్లు చెరువులో నిర్మాణాలు చేపట్టారని హైడ్రా కమిషనర్ గుర్తించారు. కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి రెవెన్యూ సరిహద్దుల్లో ఉన్న ఈదుల కుంటను సర్వే చేసి సరిహద్దులు గుర్తించే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులకు రంగనాథ్ ఆదేశాలు జారీ చేశారు. చెరువుల పునరుద్ధరణకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఈదులకుంట చెరువు ఆక్రమణలను పూర్తిగా తొలగిస్తామని, ఎవరు నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి మండలంలోనే అత్యధిక చెరువులు కబ్జాలకు గురైనట్లు గుర్తించామని, ప్రతీ చెరువును కాపాడేందుకు కృషి చేస్తామని తెలిపారు.



## వాసవి మాత ఆలయంలో 1, 116 దీపాలు వెలిగించిన మహిళలు



నకిరేకల్ నవంబర్ 26 (రోమింగ్ న్యూస్) : ద్వాదశి సందర్భంగా బుధవారం రాత్రి పట్టణంలో నూతనంగా నిర్మించిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి మహిళలు వెయ్యి 116 ద్వీపాలు వెలిగించి తమ భక్తి భావాన్ని చాటుకున్నారు శ్రీధర్ స్వామీజీ సూచన మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయం ప్రతినిధి శ్రీమతి బ్రహ్మదేవర పద్మ కృష్ణమూర్తి తెలిపారు ఆలయంలో 41 రోజులపాటు వాసవి మాత పారాయణంతోపాటు పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు ప్రతినిత్యం ఆర్యవైశ్య సోదర సోదరీమణులు ఆలయాన్ని దర్శించి అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని ఆమె కోరారు

## జనగామలో బాల్య వివాహాలు జరగవద్దు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



జనగామ, నవంబర్ 27 (రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టాలని, జిల్లాను బాల్య వివాహ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. బుధవారం, బాలల పరిరక్షణ విభాగం, స్కోప్ ఎన్జీవో ఆధ్వర్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహ రహిత భారత్ క్యాంపెయినింగ్ లో భాగంగా బాల్య వివాహ్ విముక్త్ భారత్ పోస్టర్లను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే బాలబాలికలకు వివాహం చేయడం వల్ల వారి భవిష్యత్ కు ఆటంకం కలుగుతుందని, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని, అందుకు తగిన ప్రణాళికలు రూపొందించుకొని జిల్లాలోని అన్ని గ్రామాలు, మండలాల్లో విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జనగామ జిల్లాను బాల్య వివాహ నిర్మూలన జిల్లాగా మార్చాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. బాల్య వివాహాలపై ఫిర్యాదు చేయడానికి చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098లో సంప్రదించాలని కోరారు. అలాగే సమాచారం తెలిపిన వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ఫ్లోరెన్స్, సిడబ్ల్యూసీ చైర్ పర్సన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎల్. రవికాంత్, పీఓఐసీ స్వప్నారాణి, చైల్డ్ లైన్ కో-ఆర్డినేటర్ రవి కుమార్, స్కోప్ ఎన్జీవో కో-ఆర్డినేటర్ మనోజ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## జనగామ జిల్లా నూతన విద్యా శాఖ అధికారిగా ఎం. రమేష్

### ప్రస్తుత డీఈవో రాము జగిత్యాలకు బదిలీ



జనగామ, నవంబర్ 27: (రోమింగ్ న్యూస్) : జనగామ జిల్లా నూతన విద్యాశాఖ అధికారిగా ఎం. రమేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇక్కడ ఫుల్ అడిషనల్ ఛార్జ్ తీసుకుని విద్యాశాఖ అధికారిగా విధులు నిర్వహించిన రాము జగిత్యాలకు బదిలీపై వెళ్లారు. దాంతో ఇక్కడ ఇప్పటివరకు విద్యాశాఖ లో పనిచేస్తున్న సీనియర్ అధికారిగా ఉన్న ఎం.రమేష్ కు ఫుల్ అడిషనల్ చార్జ్ అప్పగించడంతో ఆయన జనగామ జిల్లా విద్యాశాఖ అధికారిగా నియమితులయ్యారు. బుధవారం జిల్లా విద్య శాఖ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి ఆశీర్వాదాలు తీసుకున్నారు . మరోవైపు ఇప్పటి వరకు ఇక్కడ జిల్లా విద్యాశాఖ అధికారి గా పని చేసిన రాము బదిలీపై జగిత్యాలకు వెళ్తున్న సందర్భంగా ఆయన చేసిన సేవలను గుర్తిస్తూ ఆయనను గౌరవంగా విద్యాశాఖ అధికారులు, సిబ్బంది శాలువలు కప్పుతూ, పుష్పగుచ్చాలు అందిస్తూ ప్రేమపూర్వకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ గౌసియా బేగం, ఇతర సంబంధిత విద్యా శాఖ అధికారులు పలువురు పాల్గొన్నారు.



# జనగామను బాల్య వివాహాలు లేని జిల్లాగా మారుద్దాం!!

### కలిసి కట్టుగా పనిచేద్దాం... జనగామను ఆదర్శంగా నిలుపుదాం

### బాల్య వివాహాలు వద్దే వద్దని స్కోప్ అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న పిలుపు





జనగామ, రోమింగ్ న్యూస్: జనగామ జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లాగా మార్చేందుకు కదులుదాం...ఆ దిశగా అందరూ కలసి కట్టుగా పనిచేయాలని పెంబర్తిలో జరిగిన బాల్య వివాహ్ విముక్త భారత్ కార్యక్రమంలో ప్రసంగించిన వక్తలు అన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథి గా డి.ఎల్.ఎస్.ఏ. సెక్రటరీ విక్రమ్ హాజరయ్యారు.

స్కోప్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు డాక్టర్ బండి సాయన్న అధ్యక్షత వహించారు. జనగామ జిల్లాలో పెంబర్తి గ్రామంలో గల తెలంగాణ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల మరియు జూనియర్ కాలేజీలో స్కోప్ ఎన్జీవో సంస్థ మరియు జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా బాల్య వివాహ విముక్త భారత్' అవగాహన సదస్సును స్కోప్ సంస్థ చైర్మన్ డాక్టర్ బండి సాయన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. విక్రమ్ సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తూ బాల్యంలో వివాహం చేసుకోవడం వల్ల శారీరకంగా, మానసికంగా ఎదుగుదల ఉండదని, చిన్న వయసులోనే అనారోగ్యాలకు గురవుతారని ,అలాగే ప్రతి కుటుంబంలో కూడా బాల్య వివాహాలపై, 2006 బాల్యవివాహాల నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు , జనగామ జిల్లాను బాల్య వివాహాలు లేని జిల్లా దిశగా అందరూ కలసి కట్టుగా పనిచేయాలని సూచించారు. డి.డబ్ల్యు.ఓ ఫ్లోరెన్స్ మాట్లాడుతూ, విద్యార్థినీ విద్యార్థులకు బాలల హక్కులు, వారి బాధ్యతలు తెలుసుకొని భవిష్యత్తు ఉన్నతంగా రూపొందించుకోవాలన్నారు, ప్రభుత్వం పిల్లలు అందించే సంక్షేమ కార్యక్రమాలను ఉపయోగించు కోవాలని కోరారు , బాల్య వివాహం వల్ల జరిగే అనర్ధాలు గురించి వివరించారు.

బాల్యంలో విద్యపై ఆసక్తి కలిగి ఉండాలని,ప్రాపంచిక విషయాలపై దృష్టి పెట్టకుండా, నిరంతరం లక్ష్యసాధన దిశగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బాల్య వివాహ నిర్మూలనకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు , విద్యార్థులు ప్రతిజ్ఞ చేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో సిడబ్ల్యూసీ చైర్ పర్సన్ ఉప్పలయ్య, జిల్లా బాలల పరిరక్షణ అధికారి ఎల్. రవికాంత్, రవికుమార్ చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్, స్కోప్ ఎన్జీవో చైర్మన్ డాక్టర్ బండి సాయన్న , పాఠశాల ప్రిన్సిపాల్ రుక్సానా , స్కోప్ ఎన్ జి ఓ జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ లీగల్ ఎయిడ్ కౌన్సెల్ రవీందర్,మనోజ్ కుమార్, నాద్ర తబసుమ్, తరుణ్, పద్మ, లావణ్య మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ కు మాదిగల చేతిలో పతనం తప్పదు

### ఎమ్మార్పీఎస్ హెచ్చరిక

### డిసెంబర్ 21న మాదిగలు భారీగా తరలి రావాలి



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ఎస్.సీ వర్గీకరణ పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి మాదిగల చేతిలో భారీ మూల్యం తప్పదనీ

ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మాదిగల్లో అసంతృప్తి

పెరుగుతున్నదన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధనకై డిసెంబర్ 21న హైదరాబాదులో జరిగే మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేయాలన్నారు. మహాజన సోషలిస్ట్ పార్టీ ఉమ్మడి నల్లగొండ జిల్లా కో-ఆర్డినేటర్

కందుకూరి సోమన్న మాదిగ ఉమ్మడి నల్గొండ జిల్లా కో-ఆర్డినేటర్ బోడ సునీల్ మాదిగ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసుకునే అధికారం ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం ఉన్నదని ఆగస్టు 1 తేదీన అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగ ధర్మాసనం సుప్రీంకోర్టు ఆరుగురు జడ్జీల

ఇచ్చిన తీర్మానం తర్వాత కూడా తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తూ మాదిగ మాదిగ ఉపకులాలకు ద్రోహం తలపెడుతుందని విజ్ఞప్తి చేసారు.

ఎస్సీ వర్గీకరణ సుప్రీంకోర్టు తీర్పును భారతదేశంలోనే తెలంగాణలో మొట్టమొదట అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా చెప్పిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పుడు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తూ మరోవైపు ఎస్సీలకు సంబంధించిన వేలాది ఉద్యోగాలను వర్గీకరణ లేకుండానే పూర్తి చేస్తున్నారని ఇది రేవంత్ రెడ్డి సర్కార్ మాదిగలకు చేస్తున్న ద్రోహం అని తెలియజేశారు.

కాంగ్రెస్ పార్టీలో జాతీయస్థాయిలో పలుకుబడి కలిగిన మాల రాజకీయ నాయకుల ఒత్తిడితోనే రేవంత్ రెడ్డి ప్రభుత్వం వర్గీకరణ విషయంలో జాప్యం చేస్తుందని అందుకు తెలంగాణలో అతి త్వరలోనే మాదిగల చేతుల్లో కాంగ్రెస్ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని విజ్ఞప్తి చేశారు.

సామాజిక న్యాయానికి విరుద్ధంగా స్వార్థపరులైన కొంతమంది ఎదిగిన మాల రాజకీయ నాయకుల చేతిలో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ కీలుబొమ్మగా మారిందని తెలియజేసారు. ఎస్సీ వర్గీకరణ పై ఇప్పటికే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన కమిషన్ రిపోర్ట్ లు అనుకూలంగా ఉన్నప్పటికీ మళ్లీ తెలంగాణలో కమిషన్ కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ మాదిగలను నిలువ మోసం చేస్తున్నారని తెలిపారు

ఎస్సీ వర్గీకరణ పై తెలంగాణలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా డిసెంబర్ 21వ తేదీన హైదరాబాదులో సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్ లో లక్షలాదిమంది మాదిగ మాదిగ ఉపకులాలతో జరిగే మాదిగల ధర్మ యుద్ధ మహాసభకు తెలంగాణలోని లక్షలాది మంది మాదిగలు ఇండ్లకు తాళాలు వేసి స్వచ్ఛందంగా తరలివచ్చి భారీ బహిరంగ సభను విజయవంతం చేయగలరని తెలియజేశారు ఈ కార్యక్రమంలో

మహాజన సోషలిస్ట్ పార్టీ ఏం.ఎస్.పీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు నల్ల చంద్ర స్వామి మాదిగ. యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు దుబ్బ రామకృష్ణ మాదిగ.

ఎం.ఎస్.పీ. జాతీయ నాయకులు ఆలేరు నియోజకవర్గ ఇన్చార్జి మంద శంకర్ మాదిగ. మండల ఇంచార్జీ బూడిద జానీ మాదిగ, ఎం.ఎస్.ఎఫ్ జిల్లా అధ్యక్షులు కొల్లూరి హరీష్ మాదిగ, సుంచు ప్రేమ్ మాదిగ, ఆకారపు లక్ష్మీ నారాయణ మాదిగ, వద్దిగళ్ల రాజు మాదిగ, బొల్లారం నాగరాజు మాదిగ,

బుగ్గ కనుక రాజు మాదిగ, బుగ్గ రమేష్ మాదిగ, బుగ్గ అంబేద్కర్ మాదిగ, కానుకుంట్ల నవీన్ మాదిగ, బూడిద భాను మాదిగ, ఒగ్గు శివ మాదిగ, పాపట్ల క్రాంతి మాదిగ, బూడిద నవీన్ మాదిగ, బూడిద కుమార్ మాదిగ, బూడిద శ్రీకాంత్ మాదిగ, బూడిద వేణు మాదిగ, బూడిద నవీన్ మాదిగ, బూడిద వంశీ మాదిగ, ఇటుకల గణేష్ మాదిగ, బూడిద మల్లేష్ మాదిగ, వద్దిగళ్ల శ్రీకాంత్ మాదిగ, చింతకింది సాయికిరణ్ మాదిగ, వద్దిగళ్ల రాజు మాదిగ, వద్దిగళ్ల శ్రీకర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

**గుట్ట మండల కమిటీ నూతన కార్యవర్గం**

యాదగిరిగుట్ట మండల నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది. ఎం.ఆర్.పీ.ఎస్ నూతన అధ్యక్షులుగా ఆకారపు లక్ష్మీనారాయణ మాదిగ, ఎం.ఎస్.పీ.మండల అధ్యక్షులుగా

సుంచు ప్రేమ్ మాదిగలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం 28 నవంబర్ 2024





# పింఛన్ కోసం వృద్ధులు పడిగాపులు

**నాటి ప్రభుత్వంలో టంఛన్ వచ్చేది..**
**కాంగ్రెస్ హయాంలో**
**20 దాటినా రాని పరిస్థితి**
**ట్విటర్ వేదికగా విమర్శలు**
**గుప్పించిన మాజీ మంత్రి కేటీఆర్**



హైదరాబాద్, నవంబర్ 27 : మాజీ సీఎం కేసీఆర్ పాలనలో వృద్ధులు ఎవరి మీద ఆధారపడకుండా మందు బిల్లలు, ఇంటి నిత్యావసరాలు పింఛన్ డబ్బులతో తెచ్చుకునేవారని, కానీ కాంగ్రెస్ పాలనలో అది సాధ్యం కావడం లేదని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ఏలుబడిలో వృద్ధులు పింఛన్ల కోసం పడిగాపులు పడుతున్నారన్నారు. నెలానెలా సరైన సమయంలో పింఛన్లు ఇవ్వకపోవడంతో వృద్ధులు, వికలాంగులు తీవ్ర ఇబ్బందులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఈ క్రమంలో నిత్యం ఎక్కడో చోట పింఛన్ల కోసం రోడ్డెక్కుతున్న ప్రభుత్వానికి పట్టడం లేదని విమర్శించారు. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో పింఛన్ వృద్ధులు రోడ్డెక్కి వెంటనే పింఛన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలో నెలనెలా సక్రమంగా పింఛన్ వచ్చేదని.. కాంగ్రెస్ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినంక పింఛన్ డబ్బుల కోసం ఎదురుచూడాల్సి వస్తుందని వాపోయారు. 18 నుంచి 20వ తేదీలోగా పోస్టాఫీసుల్లో ఇచ్చేవారని.. నవంబర్ 25వ తేదీ వచ్చినా ఇంకా డబ్బులు ఇవ్వలేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండురోజుల్లోనే వచ్చేలా చూస్తామని పోలీసులు హామీ ఇవ్వడంతో వృద్ధులు శాంతించారు. తెలంగాణాలో పింఛన్ల కోసం కోసం వృద్ధులు రోడ్డెక్కుతారని ఎవరు అనుకున్నారు.. టంచన్‌గా అకౌంట్లో పడే పడే పైసలు ఆగిపోతాయని ఎవరునుకున్నారు? అన్నారు. మూసీ బ్యూటిఫికేషన్ కోసం లాక్షా యాభై వేల కోట్లు వెదజల్లి.. కనికరం లేకుండా వృద్ధుల పెన్షన్ డబ్బులను ఆపుతారని అనుకున్నారన్నారు. మందుబిల్లల కోసం కొడుకులు, కోడళ్ల దగ్గర చేయిచాచే అవసరమే లేని రోజుల నుంచి మళ్లీ వేడుకునే 'మార్పు' వస్తుందని ఎవరు ఊహించారని.. అణువణువునా కర్కశత్వాన్ని నింపుకున్న ఇందిరమ్మ రాజ్యంలో ఇంటింటా ఇక్కట్లే ఉంటాయని ఎవరనుకున్నారు..? మార్పు ఇంత మోసగిస్తుందని ఎవరనుకున్నారు? అంటూ 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ పెట్టారు.

## ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి విఫలం

**శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు**



అమరావతి, నవంబర్ 27 : మహారాష్ట్ర తదుపరి ముఖ్యమంత్రి ఎవరన్నది ఇంకా తేలలేదు. నాలుగు రోజులుగా ఈ అంశంపై తీవ్రంగా చర్చ నడుస్తోంది. గత శాసనసభ గడువు మంగళవారంతో ముగిసినప్పటికీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహారాష్ట్రలో ఇంకా స్పష్టత రాలేదు. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టాలన్నదానిపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో శివసేన (యూటీబీ) నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. గత అసెంబ్లీ గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వ ఏర్పాటులో మహాయుతి కూటమి విఫలమైందని విమర్శించారు. ఈ మేరకు రాష్ట్రంలో రాష్ట్రపతి పాలనను అమలు చేయాలన్నారు. 'అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమికి భారీ మెజారిటీ వచ్చింది. నవంబర్ 26వ తేదీతో శాసనసభ పదవీకాలం కూడా ముగిసింది. అయినప్పటికీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేకపోతోంది. ఇప్పటి వరకూ ముఖ్యమంత్రిని కూడా నిర్ణయించలేదు. మేమే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాం అనే పరిస్థితి వచ్చినప్పుడు 26వ తేదీలోగా ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే రాష్ట్రపతి పాలన విధించాలి' అని సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవలే జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మహాయుతి కూటమి భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు గానూ.. బీజేపీకి 132, శివసేనకు 57, ఎన్సీపీకి 41 స్థానాలు లభించాయి. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర కొత్త ప్రభుత్వం ఏర్పడటానికి మార్గం సుగమం చేస్తూ ముఖ్యమంత్రి పదవికి ఏక్‌నాథ్ షిండే మంగళవారం రాజీనామా చేశారు. కొత్త ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టేవరకూ ఆపద్ధర్మంగా కొనసాగాలని గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ షిండేను కోరారు.

## ఒవైసీ నిర్మాణాల్ని రేవంత్ రెడ్డి ఎందుకు కూల్చడం లేదు?

**మాజీ ఎంపీ, బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్**



హైదరాబాద్, నవంబర్ 27 : తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పేద, మధ్యతరగతి వర్గాల ఇళ్లను కూల్చేస్తున్నాడని, కానీ కాంగ్రెస్ ఉన్నత వర్గం, వారి బీఆర్ఎస్ మిత్రపక్షం, ఒవైసీ సోదరుల విశాలమైన అక్రమ నిర్మాణాలను, రాజభవనాల వంటి ఫాంహౌస్‌లను మాత్రం కూల్చడం లేదని మాజీ ఎంపీ, బీజేపీ నేత బూర నర్సయ్య గౌడ్ విమర్శించారు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, భూసేకరణ, రహదారుల పేరుతో ఫార్మా కంపెనీల పేరుతో భూములు లాక్కుంటున్నారని మండిపడ్డారు. మూసీ ప్రక్షాళనకు బీజేపీ వ్యతిరేకం కాదని, కానీ నిర్వాసితులకు న్యాయం జరగాలన్నదే తమ ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో ప్రజలు బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు కోసం ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడు జరిగినా బీజేపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మూసీ ప్రక్షాళన చేపట్టినా దానిని పూర్తి చేసేది మాత్రం తమ బీజేపీ ప్రభుత్వమేనని వ్యాఖ్యానించారు. అయితే మూసీ ప్రక్షాళన కంటే ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సూచించారు. కులగణన నివేదిక రాగానే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. వివిధ రాష్ట్రాల్లో వరుస ఎన్నికల్లో బీజేపీ విజయం సాధిస్తోందన్నారు. హర్యానా, మహారాష్ట్రలో బీజేపీ సర్వేలకు భిన్నంగా విజయం సాధించిందన్నారు. ఝార?ండ్, జమ్ము కశ్మీర్‌లలో తమకు ఓటు బ్యాంకు పెరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఆయా రాష్ట్రాలలో 50 సీట్లు కూడా గెలవలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ, రాహుల్ గాంధీ నాయకత్వంపై ప్రజలకు విశ్వాసం లేదని విమర్శించారు.రేవంత్ రెడ్డి డిమోలిషన్ మ్యాన్ అని, అంటే కూల్చివేతల మనిషి అని బూర నర్సయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తెలంగాణ పరిస్థితి పెనం నుంచి పొయ్యి మీద పడినట్లయిందని వ్యాఖ్యానించారు. హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణలలో గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి... ప్రజలను మోసం చేసిందన్నారు.

# మోదీ నిర్ణయమే ఫైనల్

**మా మధ్య ఎలాంటి విభేదాలు లేవు : ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు**



ముంబై, నవంబర్ 27 : మహారాష్ట్రలో సీఎం పదవిపై ఉత్కంఠ కొనసాగుతున్న వేళ, రాష్ట్రపు అపద్ధర్మ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కీలక వ్యాఖ్యలు చేశారు. ఆయన తనకు ఎలాంటి అసంతృప్తి లేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవిపై ఎలాంటి నిర్ణయమైనా ప్రధాని మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా నిర్ణయమే తుది నిర్ణయమని ఆయన పేర్కొన్నారు. బుధవారం థానేలో తన నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని స్పష్టం చేశారు."పోరాటం నా రక్తంలో ఉంది,"అని ఏక్‌నాథ్ చెప్పారు.మహాయుతి గెలుపు కోసం ఆయన పలు సంవత్సరాల పాటు కార్యకర్తగా పనిచేసినట్లు పేర్కొన్నారు."నేను ఒక కార్యకర్తగా పని చేసి ఒక కార్యకర్తలా చెప్పులు అరిగేలా తిరిగానని పేర్కొన్నారు"అని తెలిపారు. పార్టీకి వచ్చిన విజయం గురించి, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు మహావికాస్ అఘాడీ కూటమిని తిరస్కరించిన విషయం మీద శింధే వ్యాఖ్యానించారు. "మా దృష్టిలో ముఖ్యమంత్రి అంటే ప్రజలతో నేరుగా సంబంధం ఉన్న వ్యక్తి," అని ఆయన చెప్పారు. తాను ఎప్పటికీ అధికారికంగా ఒక ముఖ్యమంత్రిగా ప్రవర్తించలేదని, ఒక సాధారణ వ్యక్తిగా ప్రజల మధ్య తిరిగానని చెప్పారు. ఆయన ఒక రైతు కుటుంబం నుండి వచ్చారని, పేదల కష్టాలను బాగా అర్థం చేసుకునే వ్యక్తిగా ఉన్నారని వెల్లడించారు. "జీవితంలో ఎన్నో అడ్డంకులు చూశాను," అని ఆయన తెలిపారు. మహారాష్ట్ర అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, బాల్ థాక్రే ఆశయాలను కొనసాగించగలిగే విధంగా పనిచేస్తానని పేర్కొన్నారు. ఆయనకు ప్రధాని మోదీ నుండి పూర్తిగా మద్దతు ఉందని అన్నారు."ప్రమోషన్ల కోసం అనవసరంగా వార్తల్లో ఉండాలని నాకు అభిరుచి లేదు," అని స్పష్టం చేశారు. తన సహచర మంత్రులతో కలిసి తాను 24/7 పనిచేశామని, ఇకపై ముఖ్యమంత్రిగా ఎవరు నియమించబడతారో బీజేపీ హైకమాండ్‌నే నిర్ణయించాల్సి ఉందని చెప్పారు."ముఖ్యమంత్రి పదవిపై మోదీ,అమిత్ షా వారు తీసుకునే నిర్ణయమే తుది నిర్ణయమని, ఎవరైనా నిర్ణయం తీసుకున్నా, నేను అది అంగీకరించి, వారికోసం పనిచేస్తానని" అన్నారు.

## ఐఐటీ బాంబే విద్యార్థి అరెస్టు

**అతని ఎకౌంట్ నుంచి రూ.7.29 లక్షలు మాయం**

ముంబై, నవంబర్ 27 : ఐఐటీ ముంబై విద్యార్థి దారుణంగా మోసపోయాడు. అతని వద్ద నుంచి డిజిటల్ అరెస్టుతో రూ.7.29 లక్షలు కాజేశారు. ట్రాయ్ నుంచి ఫోన్ చేస్తున్నామని చెబుతూ ఓ వ్యక్తి అతన్ని బెదిరించాడు. ప్రస్తుతం జరుగుతున్న సైబర్ నేరాల్లో డిజిటల్ అరెస్టులు ఎక్కువగా జరుగుతున్న విషయం తెలిసిందే. వివరాల్లోకి వెళ్తే.. ఈ ఏడాది జూలైలో ఓ గుర్తు తెలియని నెంబర్ నుంచి 25 ఏళ్ల స్టూడెంట్‌కు ఫోన్ కాల్ వచ్చింది. ట్రాయ్ ఆఫీసు నుంచి కాల్ చేస్తున్నామని, మొబైల్ నెంబర్‌పై 17 ఫిర్యాదులు ఉన్నాయని అతను బెదిరించాడు. అయితే నెంబర్‌ను డీయాక్టివేట్ చేయకుండా ఉండేందుకు .. పోలీసుల నుంచి ఎన్వోసీ సర్టిఫికేట్ అవసరం ఉంటుందని ఆ ఉద్యోగి స్టూడెంట్‌కు చెప్పాడు. ఫోన్ కాల్‌ను సైబర్ క్రైం బ్రాంచ్ పోలీసులు ట్రాన్స్‌ఫర్ చేస్తున్నట్లు అతను చెప్పాడు. ఆ తర్వాత వాట్సాప్ కాల్‌లో ఓ వ్యక్తి పోలీసు ఆఫీసర్ దుస్తుల్లో కనిపించాడు. బాధితుడి ఆధార్ నెంబర్ అడిగాడతను. ఆ నెంబర్ నుంచి మనీల్యాండరింగ్ జరుగుతున్నట్లు ఆరోపించాడు. యూపీఐ ద్వారా 29 వేలు ట్రాన్స్‌ఫర్ చేసేలా విద్యార్థిని వత్తిడి చేశాడు. ఆ తర్వాత డిజిటల్ అరెస్టు చేసిన విద్యార్థిని ఎవరితో కాంటాక్టు కాకుండా చేశాడు. తర్వాత రోజు ఫోన్ చేసి మరిన్ని డబ్బులు డిమాండ్ చేశాడు. ఆ సమయంలో బాధితుడు తన బ్యాంక్ వివరాలను వెల్లడించాడు. అప్పుడు అతని అకౌంట్ నుంచి ఏడు లక్షలు కాజేశారు. డబ్బులు తీసుకున్న తర్వాత.. ఇక ఎటువంటి అరెస్టులు ఉండవని స్టూడెంట్‌కు నిందితుడు భరోసా ఇచ్చాడు. డిజిటల్ అరెస్టు గురించి ఆన్‌లైన్‌లో తెలుసుకున్న తర్వాత.. ఆ విద్యార్థి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

## ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పులపై కీలకమైన పరిణామం

**కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రకటించిన బైడెన్**



న్యూఢిల్లీ, నవంబర్ 27 : ఇజ్రాయెల్-హెజ్‌బొల్లా మధ్య కాల్పుల విషయంలో కీలకమైన పరిణామం చోటు చేసుకుంది. ఇజ్రాయెల్ ప్రభుత్వం హెజ్‌బొల్లాతో కాల్పుల విరమణపై అంగీకారం కుదుర్చుకున్నట్లు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వెల్లడించారు. ఈ విషయాన్ని ఆయన ఎక్స్ వేదికగా చేసిన పోస్ట్‌లో ప్రకటించారు. 'ఇదొక శుభవార్త. నేను ఇజ్రాయెల్, లెబనాన్ నాయకులతో మాట్లాడాను. టెల్‌అవీవ్-హెజ్‌బొల్లాల మధ్య ఉత్కంఠభరిత పరిస్థితులకు ముగింపు చేకూర్చేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలను వారు సమర్థించారు. ఇది ఒక మంచి అడుగు" అని బైడెన్ తెలిపారు.ఇక ఈ పరిణామంపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా స్పందిస్తూ, ఈ ఒప్పందం ఎంతకాలం అమలులో ఉంటుందనేది లెబనాన్ వైఖరిపై ఆధారపడి ఉంటుందని అన్నారు. "మేము ఒప్పందానికి కట్టుబడి ఉంటాం. కానీ ఉల్లంఘనల జరిగితే తగిన ప్రతిస్పందన ఇస్తాం. విజయం సాధించే వరకు మేము ఏకంగా పోరాటం కొనసాగిస్తాం" అని నెతన్యాహు స్పష్టం చేశారు.

## ఖమ్మం జిల్లాలో వృద్ధ దంపతుల దారుణ హత్య!

ఖమ్మం, నవంబర్ 27 : ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం కేంద్రంలో వృద్ధ దంపతులు దారుణ హత్యకు గురయ్యారు. నిద్రిస్తున్న ఇద్దరినీ దిండుతో మోది హత్య చేసినట్లు భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో ఎర్ర వెంకటరమణ (68), కృష్ణకుమారి (62) అనే దంపతులు నివాసం ఉంటున్నారు. ఈ దంపతులిద్దరినీ మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు హతమార్చారు. బుధవారం మధ్యాహ్నం గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో విషయం బయటికి తెలిసింది. ఇంట్లో దంపతులు ఇద్దరే ఉండటాన్ని అదునుగా భావించిన దుండగులు బంగారు నగలు, నగదు కోసమే హత్య చేసి ఉంటారని తొలుత భావించారు. కాగా హత్య అనంతరం ఇంట్లో బంగారం, నగదు ఎక్కడివి అక్కడే ఉండటంతో ఇవి పక్కా ప్రణాళికతో జరిగిన హత్యలుగా పోలీసులు అంచనా వేస్తున్నారు. వెంకట రమణకు పెరాలసిస్ ఉండటంతో కాస్త ఆదరవు కోసం ఇంట్లోని ఒక గదిని గుర్తు తెలియని వ్యక్తులకు కిరాయికి ఇచ్చినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా దంపతుల హత్య అనంతరం వారు కనిపించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఇటు క్లూస్ టీం బృందం కూడా పరిశీలన జరుపుతోంది. కాగా ఇంటి సమీప ప్రాంతంలోనే కారం పొడి డబ్బాతో పాటు శీతల పానీయాల బాటిల్స్ లభించడంతో అనుమానంతో వాటిని సేకరించారు. ఎలాంటి ఆధారాలు దొరక్కుండా ఇంటి చుట్టూ కారం పొడి చల్లినట్లు ఆనవాళ్లు కనిపించాయి. అయితే వృద్ధులైన ఆ ఇద్దరిని హతమార్చాల్సిన అవసరం ఎవరికి ఉంటుందనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఇంట్లో విలువైన వస్తువులు తస్కరణకు గురికాకపోవడంతో దీని వెనుక ఆ దంపతుల బంధువుల హస్తం ఏమైనా ఉంటుందేమో అన్న కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. ఏదిఏమైనా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో వృద్ధ దంపతుల హత్యల ఉదంతం కలకలం రేపుతోంది.

## ఆకర్షణీయమైన వేదికలుగా పర్యాటక కేంద్రాలు

**సాహస జల క్రీడల కోసం అభివృద్ధికి అడుగులు**
**34 జలవనరుల్లో స్పీడ్, హౌస్‌బోట్లు ఏర్పాటుకు చర్యలు**

Telangana Tourism

హైదరాబాద్, నవంబర్ 27 : తెలంగాణ రాష్ట్రంలోని నదుల బ్యాక్‌వాటర్లు, రిజర్వాయర్లు, చెరువులను సాహస జల క్రీడల కోసం ఆకర్షణీయమైన వేదికలుగా మారుస్తున్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రకటించింది.ఈ లక్ష్యంతో, 34 జలవనరులను బోటు షికారు సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటోంది.ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో (పీపీపీ) ఈ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రణాళికలు రూపొందించినట్లు సమాచారం.మొదటగా, హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్, సోమశిలలోని కృష్ణా నది బ్యాక్‌వాటర్‌లలో సరికొత్త బోటింగ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. ఈ రెండు ప్రదేశాల్లో టెండర్ల ప్రక్రియ ముగిసిన తర్వాత, ప్రైవేటు సంస్థలతో ఒప్పందం కుదుర్చుకోవాలని భావిస్తున్నారు.డిసెంబరు 4నుంచి స్పీడ్ బోట్లు, ఇతర సాహస జలక్రీడలు ప్రారంభమయ్యే అవకాశం ఉన్నట్లు పర్యాటక అభివృద్ధి సంస్థ వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా జలపర్యాటకాన్ని ప్రోత్సహించేందుకు, పలు జిల్లాల్లో వాటర్ స్పోర్ట్స్ కార్యక్రమాలను ప్రవేశపెట్టేందుకు టూరిజం సంస్థ జలవనరులను ఎంపిక చేసింది.హుస్సేన్‌సాగర్, సోమశిల, కరీంనగర్ లోయర్‌మానేరు డ్యాం, రామప్ప చెరువు, లకారం, మధిర చెరువులు, నాగార్జునసాగర్‌లో కృష్ణా నది (హౌస్‌బోట్), బుద్ధవనం వద్ద కృష్ణా నది (హౌస్‌బోట్), గోదావరిఖని వద్ద గోదావరి నది, మహబూబ్‌నగర్, సిద్దిపేట కోమటిచెరువు, భద్రకాళి చెరువు, కోటిపల్లి రిజర్వాయర్, రంగనాయకసాగర్, కొండపోచమ్మ సాగర్, కడెం రిజర్వాయర్ వంటి వివిధ జలాశయాలను జాబితాలో చేర్చారు. ఈ ప్రదేశాల్లో స్పీడ్ బోట్లు, డీలక్స్ బోట్లు, హౌస్‌బోట్లు, అలాగే పర్యాటకులకు మరిన్ని సౌకర్యాలు అందించే ప్రణాళికలు ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో మధిర వద్ద జలక్రీడలతో పాటు కాటేజీలు, రెస్టారెంట్లు, పిల్లలు ఆడుకునే పరికరాల ఏర్పాటు కోసం టెండర్లు పిలిచారు. సంగారెడ్డి జిల్లా సింగూరు రిజర్వాయర్‌లో 25-30 మంది ప్రయాణించేలా డీలక్స్ బోట్లు, కాటేజీలు, కెఫెటేరియా, ఓపెన్ జిమ్ వంటి సౌకర్యాలు అందుబాటులోకి రానున్నాయి. ఖమ్మం జిల్లాలో జమలాపురం చెరువు వద్ద కూడా పర్యాటకుల సౌకర్యాల కోసం టెండర్లు పిలిచారు. 20, 40 సీట్లతో బోట్లు, కాటేజీల నిర్మాణం చేపట్టేందుకు టెండర్లు ఏర్పాటు చేశారు.

## బంగ్లాదేశ్‌లో ఇస్కాన్ నిషేధానికి పిటిషన్..

**హైకోర్టు ఆదేశాలపై ఉత్కంఠ**


న్యూఢిల్లీ, నవంబర్ 27 : బంగ్లాదేశ్‌లో ఇస్కాన్‌కు చెందిన చిన్మయ్ కృష్ణదాస్ ప్రభును బంగ్లాదేశ్ జెండాను అవమానపరిచారనే ఆరోపణలతో ఢాకా విమానాశ్రయంలో అరెస్టు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై హిందువులు భారీ ఎత్తున నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇస్కాన్ సంస్థను నిషేధించాలని బంగ్లాదేశ్ హైకోర్టులో పిటిషన్ దాఖలైనట్లు తెలుస్తోంది. ఇస్కాన్ కార్యకలాపాలపై బంగ్లాదేశ్ హైకోర్టు దృష్టి సారించగా, దేశంలో శాంతి భద్రతల పరిస్థితిపై గురువారం ఉదయానికి నివేదిక ఇవ్వాలని అటార్నీ జనరల్‌కు ఆదేశాలిచ్చింది. ఉద్రిక్తతలు పెరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలని పేర్కొంది. బంగ్లాదేశ్ మీడియా కథనాల ప్రకారం, చిన్మయ్ కృష్ణదాస్ గత నెలలో జరిగిన ఓ ర్యాలీలో పాల్గొని బంగ్లాదేశ్ జెండా పట్ల వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆరోపణలొచ్చాయి.ఈ నేపథ్యంలో ఆయనను ఢాకా విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇక చిన్మయ్ అరెస్టును వ్యతిరేకిస్తూ హిందువులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఇప్పటికే మైనారిటీలపై దాడులు జరగుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకోవడంతో భారత ప్రభుత్వం ఆందోళన వ్యక్తం చేసింది. ఇస్కాన్ కార్యకలాపాలు, చిన్మయ్ కృష్ణదాస్‌పై ఆరోపణల నేపథ్యంలో, బంగ్లాదేశ్‌లో మత సామరస్యాన్ని కాపాడేందుకు ప్రయత్నించాలని మతపరమైన సంఘాలు కోరాయి.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
గురువారం
28 నవంబర్
2024



# 52 లక్షల టీడీపీ సభ్యత్వాల నమోదు

## నారా లోకేశ్ ను అభినందించిన సీఎం చంద్రబాబు



అమరావతి, నవంబర్ 27 : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు టీడీపీ నేతలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వల్ప వ్యవధిలోనే 52 లక్షల టీడీపీ సభ్యత్వాలు నమోదు చేయించడంపై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ను అభినందించారు. సభ్యత్వ నమోదులో తొలి 10 స్థానాల్లో ఉన్న నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, నాయకులను కూడా అభినందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు నామినేటెడ్ పదవులు ఇచ్చి వారి కష్టానికి తగిన గుర్తింపును ఇచ్చామని అన్నారు. సరైన వ్యక్తిని సరైన చోట ఉంచుతామని చెప్పామని, చెప్పిన మాటను నిలబెట్టుకున్నామని అన్నారు. ఇక, కొత్తగా పొలిటికల్ గవర్నెన్స్ విధానం తీసుకువచ్చామని చంద్రబాబు వెల్లడించారు. పార్టీని ప్రభుత్వంతో అనుసంధానం చేసి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళతామని చెప్పారు. త్వరలో సాగునీటి సంఘాలు, సహకార సంఘాల ఎన్నికలు ఉన్నాయని... ఈ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులే గెలిచేలా కృషి చేయాలని చంద్రబాబు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కార్యకర్తలను ఆర్థికంగానూ, రాజకీయంగానూ పైకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. గడచిన ఐదేళ్లలో పార్టీ క్యాడర్ బీమా, ఆరోగ్యం, విద్య కోసం రూ.140 కోట్ల మేర సాయం అందించామని వెల్లడించారు. రాష్ట్రంలో రోడ్ల మరమ్మతులకు రూ.1,400 కోట్లు మంజూరు చేశామని సీఎం చంద్రబాబు వెల్లడించారు. సంక్రాంతి నాటికి రోడ్లపై గుంతలు లేకుండా చూస్తామని చెప్పారు. యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ముందుకెళుతున్నామని వివరించారు. మనం చేసే రాజకీయం కేవలం ప్రజల కోసమేనని స్పష్టం చేశారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని తప్పులు చేసేవారికి చట్టపరంగా శిక్ష పడేలా చేస్తామని అన్నారు. గత ఐదేళ్లు విచ్చలవిడిగా ఎక్కడికక్కడ భూ సమస్యలు సృష్టించారని చంద్రబాబు ఆరోపించారు. త్వరలోనే రెవెన్యూ సదస్సులు నిర్వహించి పరిష్కరిస్తామని చెప్పారు.

# యువతకు ఉద్యోగాల కల్పనే స్కిల్ సెన్సస్ అంతిమ లక్ష్యం

## రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్


## స్కిల్ సెన్సస్, స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై సమీక్ష



అమరావతి, నవంబర్ 27 : స్కిల్ సెన్సస్ అంతిమంగా నిరుద్యోగ యువతకు ఉపయోగకరంగా ఉండాలని, యువతకు ఉద్యోగాల కల్పనే స్కిల్ సెన్సస్ అంతిమ లక్ష్యమని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. స్కిల్ సెన్సస్, స్కిల్ డెవలప్ మెంట్ శాఖపై ఉండవల్లి నివాసంలో మంత్రి లోకేశ్ బుధవారం నాడు సమీక్షించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ... ఎసెస్ మెంట్ చేయకుండా కేవలం సెన్సస్ వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదని, ప్రీ ఎసెస్ మెంట్ కూడా వేగంగా పూర్తిచేయాలని అన్నారు. సెన్సస్ తోపాటే యువత, విద్యార్థుల అర్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లను కూడా ఇంటిగ్రేట్ చేయాలని, దీనివల్ల వారికి ఉద్యోగావకాశాలు మెరుగవుతాయని తెలిపారు. బేసిక్ ఎసెస్ మెంట్ చేయడానికి ఇన్ఫోసిస్ సంస్థ అంగీకరించినట్లు అధికారులు చెప్పారు. ఎన్యుమరేషన్ సమయంలో ఇళ్లవద్ద అందుబాటులో లేనివారు యాప్ ద్వారా సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసుకునే అవకాశాన్ని కల్పించినట్లు వారు తెలిపారు. సెన్సస్ పూర్తయిన తర్వాత జె.పాల్ సంస్థ ద్వారా ఎనలిటిక్స్ కూడా త్వరితగతిన పూర్తిచేయాలని మంత్రి సూచించారు. స్కిల్ సెన్సస్ తర్వాత పూర్తిస్థాయి సమాచారాన్ని వివిధ పరిశ్రమలు, సంస్థలకు అందుబాటులోకి తెస్తే వారికి అవసరమైన వారిని రిక్రూట్ చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. రాష్ట్రానికి పెద్దఎత్తున తరలివస్తున్న కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి వారికి ఏవిధమైన సిబ్బంది అవసరమో తెలుసుకోవాలని, సంబంధిత అర్హతలుగల అభ్యర్థుల సమాచారాన్ని వారికి అందుబాటులో ఉంచాలన్నారు. సెన్సస్ డాటాను లింక్డ్ ఇన్, నౌకరీ. కామ్, జాబ్ ఎక్స్ తదితర సంస్థలకు అనుసంధానిస్తే ఆయా ఏజన్సీల ద్వారా కూడా ఉద్యోగావకాశాలు లభిస్తాయమని మంత్రి తెలిపారు. ఉద్యోగార్థుల కచ్చితమైన సమాచారం కోసం పీఎఫ్, ఈఎస్ఐ, జీఎస్టీ వంటి శాఖల సమాచారాన్ని కూడా ఇంటిగ్రేట్ చేయాలని సూచించారు. స్కిల్ డెవలప్ స్పెషల్ ప్రాజెక్టులపైనా మంత్రి నారా లోకేశ్ సమీక్షించారు. ట్రైన్ అండ్ హైర్ ప్రాతిపదికన వివిధ యూనివర్సిటీల్లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఐబిఎం, మైక్రోసాఫ్ట్ కంపెనీలు అంగీకారం తెలిపినట్లు అధికారులు తెలిపారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్ స్ట్రక్షన్ (న్యాక్) ఆధ్వర్యంలో అమరావతిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుచేసి, నిర్మాణ రంగ కార్మికులకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి సూచించారు. దీనిపై ఇప్పటికే ఎల్ అండ్ టి సంస్థతో చర్చలు జరుపుతున్నట్లు అధికారులు వివరించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలో పెద్దఎత్తున నిర్మాణ కార్యకలాపాలు జరగనున్నందున నిర్మాణరంగానికి సంబంధించిన కంపెనీలను రప్పించి శిక్షణ ఇప్పించాలని మంత్రి సూచించారు. ఓంక్యాప్ ద్వారా విదేశాల్లో డిమాండ్ ఉన్న కోర్సుల్లో యువతకు శిక్షణ ఇవ్వాలని అన్నారు. ముఖ్యంగా జర్మనీలో నర్సింగ్ స్టాఫ్ కు డిమాండ్ ఉన్నందున ఆ లాంగ్వేజ్ లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో విద్యార్థులకు శిక్షణ ఇప్పించడానికి చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. ప్రభుత్వ పాలసీకి లోబడి అమరావతిలో స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కూడా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు.

# ప్రధాని మోదీతో డిప్యూటీ సీఎం పవన్ భేటీ

## జలజీవన్ మిషన్ నిధులపై చర్చ



అమరావతి, నవంబర్ 27 : ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. నిన్న పలువురు కేంద్ర మంత్రులను కలవగా.. ఇవాళ ప్రధానమంత్రి మోదీతో భేటీ అయ్యారు.పార్లమెంట్ భవనంలోని ప్రధానమంత్రి కార్యాలయంలో మోదీతో పవన్ సమావేశమయ్యారు. జలజీవన్ మిషన్ అమలు, ఏపీకి నిధులపై చర్చించారు. ఇటీవలే వచ్చిన ఎన్నికల ఫలితాలతో పాటు ఏపీ రాజకీయాలపై వీరద్దరి భేటీలో చర్చకు వచ్చినట్లు తెలిసింది. మరోవైపు ఏపీకి కేంద్రం చేస్తున్న సాయానికి పవన్ కృతజ్ఞతలు తెలిపారు.డిప్యూటీ సీఎం హోదాలో పవన్ ఢిల్లీకి వెళ్లడం ఇది రెండోసారి. కొన్ని రోజుల క్రితం ఆయన ఢిల్లీకి వెళ్లినప్పుడు కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలిశారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత.. తొలిసారి ఢిల్లీలో ప్రధానితో పవన్ భేటీ కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక ప్రస్తుత పర్యటనలో వరుసగా పలువురు కేంద్రమంత్రులను కలిశారు. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి భూపేంద్ర యాదవ్‌తో కూడా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ భేటీ అయ్యారు. ఎర్రచందనం అమ్మకాలు, ఎగుమతుల ప్రక్రియను సింగల్ విండో విధానానికి మార్చాలని విజ్ఞప్తి చేశారు. ఏపీకి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.ఢిల్లీ పర్యటనలో భాగంగా పవన్ కల్యాణ్ ను పలువురు ఎంపీలు కలిశారు. ఏపీ నుంచి బీజేపీ ఎంపీగా ఉన్న పురందేశ్వరితో కాసేపు మాట్లాడారు.పలు రాష్ట్రాల ఎంపీలతో కూడా పవన్ కల్యాణ్ కాసేపు ముచ్చటించారు.

# రాజ్యసభ రేసులో కూటమి కీలక నేతలు

## మూడు స్థానాల్లో ఒకటి టీడీపీకి

## మిగతా రెండు సీట్లలో ఒకటి జనసేనకు ఇచ్చే అవకాశం

## దాదాపు ఖరారైనట్టు చెబుతున్న నేతలు

## మూడో స్థానం కోసం టీడీపీ, బీజేపీ మధ్యే పోటీ

## జనసేన నుంచి నాగబాబుకు అవకాశం??



అమరావతి, నవంబర్ 27 : ఆంధ్రప్రదేశ్ కూటమి నేతల్లో రాజ్యసభ రేస్ మొదలైంది. ముగ్గురు వైసీపీ రాజ్యసభ సభ్యుల రాజీనామాతో ఖాళీ అయిన స్థానాలకు ఉపఎన్నిక నోటిఫికేషన్ జారీ చేసింది ఎలక్షన్ కమిషన్. దాంతో, కూటమి పార్టీల మధ్య వేడి రాజుకుంది. మరి, మూడు సీట్లను సమానంగా ముగ్గురూ పంచుకుంటారా? లేక లెక్కల ప్రకారం ముందుకెళ్తారా?. అసలు, రాజ్యసభ రేస్‌లో ఎవరున్నారు?. ఏ పార్టీ నుంచి ఎవరు సీటు ఆశిస్తున్నారనేది హాట్ టాపిక్ గా మారింది..ఏపీలో రాజ్యసభ రేస్ ఉత్కంఠ రేపుతోంది. రాజ్యసభ సభ్యత్వం కోసం పోటీపడుతున్నారు కూటమి నేతలు.. అయితే, మూడు స్థానాల్లో ఒకటి టీడీపీకి దాదాపు ఖరారైనట్టు చెబుతున్నారు.. మిగతా రెండు సీట్లలో ఒకటి జనసేనకు ఇచ్చే అవకాశం ఉందని.. మూడో స్థానం కోసం టీడీపీ, బీజేపీ మధ్యే పోటీ ఉందని అంటున్నారు. ఇక.. టీడీపీ నుంచి బీద మస్తాన్‌రావు, సానా సతీష్, కంభంపాటి రామ్మోహన్‌రావు, గల్లా జయదేవ్ పోటీపడుతున్నట్టు సమాచారం..! అలాగే, జనసేన నుంచి నాగబాబు.. బీజేపీ నుంచి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి రేస్‌లో ఉన్నట్టు చెబుతున్నారు.అయితే.. ఖాళీ అయిన మూడు స్థానాల్లో రెండింటికి నాలుగేళ్ల చొప్పున పదవీకాలం ఉండగా.. ఒక్కదానికి మాత్రం కేవలం రెండేళ్ల టర్మ్ మాత్రమే మిగులుంది. దాంతో, నాలుగేళ్ల పదవీకాలం ఉన్న సీట్ల కోసమే పోటీ ఎక్కువగా కనిపిస్తోంది. నాలుగేళ్ల టర్మ్ ఉన్న సీట్లలో ఒకటి టీడీపీకి ఖరారైందట. రీసెంట్‌గా రాజ్యసభకు రాజీనామా చేసిన బీద మస్తాన్‌రావే.. మళ్లీ ఈ సీటును దక్కించుకోబోతున్నట్టు సమాచారం.నాలుగేళ్ల టర్మ్ ఉన్న రెండో సీటు కోసం విపరీతమైన పోటీ నడుస్తోంది. ఈ సీటును జనసేనకు ఇస్తే మెగా బ్రదర్ నాగబాబుకు అవకాశం ఇవ్వొచ్చని టాక్. ఒకవేళ రెండేళ్ల టర్మ్ సీటును గాని జనసేనకు కేటాయిస్తే మాత్రం నాగబాబు తప్పుకోవచ్చనే మాట వినిపిస్తోంది. ఇక, బీజేపీ నుంచి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రచారంలో ఉంది. కిరణ్‌కు బీజేపీ అధిష్టానం హామీ ఇచ్చిందని.. కచ్చితంగా సీటు దక్కొచ్చని అంటున్నారు. ఇక, టీడీపీ నుంచి సీనియర్ లీడర్లు కంభంపాటి రామ్మోహన్‌రావు, గల్లా జయదేవ్ పోటీపడుతున్నారు. కాకినాడకు చెందిన సానా సతీష్ కూడా పోటీలో ఉన్నట్టు తెలుస్తోంది. నామినేషన్లకు ఇంకా మూ్డ్రోజులు మాత్రమే టైముంది. ఈనెల 30లోపు నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంది. మరి, మూడు సీట్లను మూడు పార్టీలూ సమానంగా పంచుకుంటాయా? లేక లెక్క మారుతుందా?. మరో మూ్డ్రోజుల్లో తేలిపోనుంది. గతంలో 2014 ఎన్నికల తర్వాత ఏపీలో బీజేపీతో కలిసి అధికారం పంచుకున్నప్పుడు ఆ పార్టీకి రెండు రాజ్యసభ సీట్లను ఇచ్చింది.. అనే చర్చ నడుస్తోంది. ప్రస్తుతం జనసేనకు ఏపీ అసెంబ్లీ, మండలితో పాటు లోక్‌సభలో కూడా ప్రాతినిధ్యం ఉంది. రాజ్యసభలో కూడా ఆ పార్టీ అడుగు పెడితే మొత్తం అన్ని చట్టసభల్లో జనసేన ఖాతా తెరచినట్లవుతుంది. జనసేనతో పాటు టీడీపీకి కూడా ప్రస్తుతం రాజ్యసభలో ప్రాతినిధ్యం లేదు. ఈ మూడు రాజ్యసభ బెర్త్‌లు ఏ పార్టీ ఖాతాలో వెళతాయి.. అదృష్ట జాతకులు ఎవరౌతారు అనేదే అత్యంత ఆసక్తికరం.అయితే, గత కొన్నేళ్లుగా రాజ్యసభలో టీడీపీ ప్రాతినిధ్యం కోల్పోయింది. దీంతో తిరిగి పూర్వ వైభవం దిశగా ప్రస్తుతం అడుగులు వేస్తోంది. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో ముగ్గురు వైఎస్ఆర్సీపీ సభ్యులు రాజీనామా చేయడంతో ఏర్పడ్డ మూడు ఖాళీల విషయంలో సీఎం చంద్రబాబు నిర్ణయం ఎలా ఉండబోతుంది అనేది.. ఆసక్తికరంగా మారింది.

ఏపీలో మొత్తం 175 అసెంబ్లీ స్థానాలు ఉండగా 164 సీట్లలో ఎన్డీయే కూటమి అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఒక్క రాజ్యసభ అభ్యర్థి విజయం సాధించాలంటే కనీసం 25 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ప్రస్తుతం వైఎస్ఆర్సీపీకి ఉన్న ఎమ్మెల్యేలు 11 మంది మాత్రమే. దీంతో ఆ పార్టీ రాజ్యసభ బరిలో నిలిచేందుకు కూడా అవకాశం లేదు.. దీంతో మున్ముందు ఖాళీ అయ్యే రాజ్యసభ స్థానాలన్నీ టీడీపీ కూటమికే దక్కనున్నాయి.

# గంజాయి విక్రయిస్తే సంక్షేమ పథకాలు కట్

## ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం

## గంజాయి నిర్మూలనకు సరికొత్త వ్యూహం

## నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ కు ఈగల్ గా నామకరణం


అమరావతి, నవంబర్ 27 : గంజాయి విక్రయాలకు చెక్ పెట్టేందుకు ఏపీ సర్కార్ సంచలన నిర్ణయం తీసుకుంది. గంజాయి అమ్మే వారి కుటుంబాలకు సంక్షేమ పథకాలు నిలిపివేయాలని నిర్ణయించింది. నార్కోటిక్స్ నియంత్రణపై కేబినెట్ సబ్ కమిటీ భేటీ బుధవారం భేటీ అయ్యింది. ఈ భేటీలో మంత్రి లోకేశ్ కీలక నిర్ణయాన్ని ప్రకటించారు. అలాగే యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ కు ఈగల్ అని పేరు పెట్టినట్లు తెలిపారు. పాఠశాలలు, కాలేజీలు, సచివాలయాల పరిధిలో 10 మందితో ఈగల్ కమిటీలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈగల్ కమిటీల్లో మహిళా సంఘాలు, ఆశా వర్కర్లలను భాగస్వామ్యం చేయాలని సూచించారు.అమరావతి సచివాలయం లో గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై హోంమంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన బుధవారం ఏపీ కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. యాంటీ నార్కోటిక్ టాస్క్ ఫోర్స్ పేరును 'ఈగల్'గా మార్చడంపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. టాస్క్ ఫోర్స్ విధివిధానాలతో పాటు కీలక నిర్ణయాల దిశగా సబ్ కమిటీ సమాలోచనలు జరిపింది. గంజాయి, డ్రగ్స్ నియంత్రణపై జరిగిన మంత్రుల కమిటీ భేటీలో మంత్రి నారా లోకేశ్, వైద్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, మంత్రులు సంధ్యారాణి, కొల్లు రవీంద్ర పాల్గొన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ కట్టడి చేయడంతోపాటు బాధితులను ఆ వ్యసనం నుంచి బయటపడేయడం, గంజాయి సాగు, మత్తుపదార్థాల విక్రేతల మీద కఠిన చర్యలు తీసుకోవడంపై కేబినెట్ సబ్ కమిటీలో చర్చించారు. ఈ సమావేశంలో చర్చించిన అంశాల అమలుకు యాంటీ నార్కోటిక్స్ ?టాస్క్?ఫోర్స్?ఏర్పాటు చేయాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. ఈ టాస్క్?ఫోర్స్ ?విధివిధానాలతోపాటు మరికొన్ని కీలక నిర్ణయాలను సీఎం చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్లాలని మంత్రులు నిర్ణయించారు. ఉత్తరాంధ్ర జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో గంజాయి సాగును అరికట్టేందుకు పోలీసులు స్మార్ట్ వర్క్ చేస్తున్నారు. అటవీ ప్రాంతాల్లో సాగు చేస్తు్న్న గంజాయిని అరికట్టేందుకు టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి సాగుదారుల ఆట కట్టిస్తున్నారు. డ్రోన్ల సాయంతో గంజాయి పంటను గుర్తించి ధ్వంసం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో డ్రోన్లతో గంజాయి సాగును అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నారు. ఇప్పటికే అనకాపల్లి జిల్లాలో 3. 55 ఎకరాల్లో సాగుచేస్తున్న గంజాయిని డ్రోన్ల సాయంతో గుర్తించి ధ్వంసం చేశారు.

మూడు అడుగుల ఎత్తు మేర పెరిగిన గంజాయి మొక్కలను కనిపెట్టేలా డ్రోన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నా రు.డ్రోన్లలో హై డెఫినీషన్ ఫొటోలు తీసే మల్టీ స్పెక్ట్రల్ కెమెరాలను ఉపయోగిస్తున్నారు. గంజాయి మొక్కలను గుర్తించేందుకు నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో గూగుల్ సహాయం తీసుకుని గంజాయి సాగును గుర్తించనుంది. గంజాయిని సమూలంగా ధ్వంసం చేయాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం అని అధికారులు తెలిపారు.

# డిసెంబర్ నెలలో స్కూళ్లకు భారీగా సెలవులు

## 9 రోజులు హాలీడేస్ వచ్చే అవకాశం

హైదరాబాద్, నవంబర్ 27 : తెలుగు రాష్ట్రాల్లో దసరా నుంచి స్కూళ్లకు సెలవులు ఎక్కువగా వస్తుంటాయి. ఈ ఏడాది అక్టోబర్ నెలలో దసరా సెలవులు వచ్చాయి. దీపావళి కూడా అక్టోబర్ నెలలోనే వచ్చింది. దీంతో అక్టోబర్ లో స్కూళ్లకు ఎక్కువగానే సెలవులు వచ్చాయి. నవంబర్ లో పండుగలు లేకపోవడంతో పూర్తిగా బడికి వెళ్లిన స్టూడెంట్స్ కు మళ్లీ సెలవుల సీజన్ ప్రారంభం అయ్యింది. డిసెంబర్ నెలలో దాదాపుగా 9 రోజులు సెలవులు వస్తున్నాయి. వీటిల్లో 7 సెలవులు ప్రభుత్వ హాలీడేస్ కాగా... రెండు ఐచ్ఛిక సెలవులుగా ఉన్నాయి. ఇక మిషనరీ స్కూల్స్ లో 10 రోజులు హాలీడేస్ ఇచ్చే అవకాశం ఉంది. క్రిస్మస్ పండుగ సందర్భంగా మిషనరీ పాఠశాలల్లో అదనపు సెలవులు ఉంటాయి. డిసెంబర్ నెలలో పాఠశాలలకు భారీగా రానున్నాయి. డిసెంబర్ లో 5 ఆదివారాలు, ఒక రెండో శనివారం, క్రిస్మస్ హాలీడే కలిపి 7 రోజులు హాలీడేస్ ఉన్నాయి. కొన్ని పాఠశాలలకు క్రిస్మస్ ముందు లేదా తర్వాత రోజు కూడా సెలవు ప్రకటిస్తారు. దీంతో సెలవులు 8 రోజులకు చేరాయి. మిషనరీ పాఠశాలలకు విద్యాశాఖ అకాడమిక్ క్యాలెండర్ ప్రకారం 5 రోజులు సెలవులు ప్రకటించింది. డిసెంబర్ 23 నుంచి 27 వరకు ఐదు రోజులు హాలీడేస్ మంజూరు చేశారు. డిసెంబర్ లోని 5 ఆదివారాలు కలిపి మొత్తం 10 రోజులు మిషనరీ పాఠశాలలకు సెలవులు రానున్నాయి. రెండో శనివారం సెలవుతో కలిపితే వీటి సంఖ్య 11కు చేరుతుంది. ఇక జనవరిలో సంక్రాంతి సెలవుల సందడి ఉంటుంది. డిసెంబర్, జనవరి సెలవులు పూర్తైన తర్వాత విద్యార్థులు పరీక్షల సన్నద్ధత మొదలవుతుంది. ఏపీలో క్రిస్టియన్ మైనారిటీ విద్యాసంస్థలకు డిసెంబర్ 22 నుంచి 29 సెలవులు ఇచ్చే అవకాశం ఉంది. ఏపీలో మరోసారి స్కూళ్లకు వరుస సెలవులు వచ్చే అవకాశాలున్నాయి. వర్షాకాలంలో భారీ తుపానులు, వరదల కారణంగా భారీగా సెలవులు వచ్చిన సంగతి తెలిసిందే. మరోసారి ఏపీకి తుపాను ముప్పు పొంచివుండటంతో అప్రమత్తం ఉండాలని వాతావరణశాఖ హెచ్చరించింది. దీంతో వర్షప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో స్కూళ్లకు సెలవులు ప్రకటించే అవకాశం వుంది. తీవ్ర వాయుగుండం ప్రభావం ఏపీ, తమిళనాడుతో అండమాన్ నికోబార్ దీవులపై ఎక్కువగా ఉంటుదని ఐఎండీ తెలిపింది. ఏపీలోని దక్షిణకోస్తా, రాయలసీమలో భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వెల్లడించింది.



# మణికొండలో అగ్నిప్రమాదం..

## గృహప్రవేశ దీపం కిందపడి ఫ్లాట్‌లో చెలరేగిన మంటలు!

హైదరాబాద్, నవంబర్ 27 : హైదరాబాద్ నగరంలో వరుస అగ్నిప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంగళవారం మధ్యాహ్నం జీడిమెట్లలోని ఫ్యాబ్స్ పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా.. దాదాపు రూ.100 కోట్ల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రమాదం ధాటికి మంటలు ఆకాశానికి ఎగబాకాయి. వీటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బందికి తలకు మించిన భారంగా మారింది. ఎట్టకేలకు అదే రోజు అర్ధరాత్రి సమయానికి మంటలు అదుపులోకి వచ్చాయి. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన ఇంకా కళ్లముందు మెదులుతుండగానే మణికొండ పరిధిలోని పుప్పాలగూడలో మరో అగ్నిప్రమాదం జరిగింది. మణికొండ, రామంతపూర్‌లోని ఈఐపీఎల్ అపార్ట్‌మెంట్‌లోని 9వ అంతస్తులోని ఓ ఫ్లాట్‌లో మూడురోజుల క్రితం గృహప్రవేశం జరిగింది. సంతోష్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో గృహ ప్రవేశం చేశారు. ఈ సందర్భంగా కలశం వెలిగించి.. అంతా నిద్రపోయారు. అక్కడ వెలిగించిన దీపం బుధవారం తెల్లవారు జామున కిందపడింది. దీంతో మంటలు అంటుకోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. గమనించిన సంతోష్ కుటుంబం ఇంట్లో గ్యాస్ స్టౌవ్‌ను ఆఫ్ చేసి, వెంటనే కిందకు పరుగులు తీశారు. అపార్ట్‌మెంట్ వాసులు కూడా భయంతో బయటకు పరుగులు తీశారు. అనంతరం ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు.

### చైన్నై సూపర్ కింగ్స్ జట్టు

నూర్ అహ్మద్ (10 కోట్లు), రవిచంద్రన్ అశ్విన్ (9.75కోట్లు), డెవాన్ కాన్వే (6.25 కోట్లు), ఖలీల్ అహ్మద్ (4.8 కోట్లు) రచిన్ రవీంద్ర (4 కోట్లు), అన్షుల్ కంబోజ్ (3.4 కోట్లు), రాహుల్ త్రిపాఠి (3.4 కోట్లు), సామ్ కర్రన్ (2.4 కోట్లు), గుర్జప్నీత్ సింగ్ (2.2 కోట్లు), నాథన్ ఇల్లిస్ (2 కోట్లు), దీపక్ హుడా (1.7 కోట్లు), జేమీ ఓవర్టన్ (1.5 కోట్లు), విజయ్ శంకర్ (1.2 కోట్లు), వన్ష్ బేడీ (55 లక్షలు), ఆండ్రే సిద్దార్థ్ (30 లక్షలు), శ్రేయస్ గోపాల్ (30 లక్షలు), రామకృష్ణ ఘోష్ (30 లక్షలు), కమలేశ్ నాగర్‌కోటి (30 లక్షలు), ముకేశ్ చౌదరీ (30 లక్షలు), షేక్ రషీద్ (30 లక్షలు)

### ఢిల్లీ క్యాపిటల్స్

కేఎల్ రాహుల్ (14 కోట్లు), మిచెల్ స్టార్క్ (11.75 కోట్లు), టి నటరాజన్ (10.75 కోట్లు), జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ (9 కోట్లు), ముకేశ్ కుమార్ (8 కోట్లు), హ్యారీ బ్రూక్(6.25 కోట్లు), అషుతోశ్ శర్మ (3.8 కోట్లు), మోహిత్ శర్మ (2.2 కోట్లు), ఫాఫ్ డుప్లెసిస్ (2 కోట్లు), సమీర్ రిజ్వి (95 లక్షలు), డొనొవన్ ఫెరియెరా (75 లక్షలు), దుష్మంత చమీరా (75 లక్షలు), విప్రాజ్ నిగమ్ (50 లక్షలు), కరుణ్ నాయర్ (50 లక్షలు), మాధవ్ తివారి (50 లక్షలు), త్రిపురణ విజయ్ (30 లక్షలు), మాన్వంత్ కుమార్ (30 లక్షలు), అజయ్ మండల్ (30 లక్షలు), దర్శన్ నల్కండే (30 లక్షలు)

### గుజరాత్ టైటాన్స్

జోస్ బట్లర్ (15.75 కోట్లు), సిరాజ్ (12.25 కోట్లు), రబాడ (10.75 కోట్లు), ప్రసిద్ధ్ కృష్ణ (9.5 కోట్లు), వాషింగ్టన్ సుందర్ (3.2 కోట్లు), షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్ (2.6 కోట్లు), గెరాల్డ్ కొయెట్జీ (2.4 కోట్లు), గ్లెన్ ఫిలిప్స్ (2 కోట్లు), సాయి కిషోర్ (2 కోట్లు), మహిపాల్ లోమ్రార్ (1.7 కోట్లు), గుర్నూర్ సింగ్ బ్రార్ (1.3 కోట్లు), అర్షద్ ఖాన్ (1.3 కోట్లు), కరీమ్ జనత్ (75 లక్షలు), జయంత్ యాదవ్ (75 లక్షలు), ఇషాంత్ శర్మ (75 లక్షలు), కుమార్ కుషాగ్రా (65 లక్షలు), మానవ్ సుతార్ (30 లక్షలు), కుల్వంత్ కేజ్రోలియా (30 లక్షలు), అనూజ్ రావత్ (30 లక్షలు), నిషాంత్ సింధు (30 లక్షలు)

### కోల్‌కతా నైట్ రైడర్స్

వెంకటేశ్ అయ్యర్ (23.75 కోట్లు), అన్రిచ్ నోర్జ్ (6.50 కోట్లు), క్వింటన్ డికాక్ (3.60 కోట్లు), అంగ్‌క్రిష్ రఘువంశీ (3 కోట్లు), స్పెన్సర్ జాన్సన్ (2.8 కోట్లు), మొయిన్ అలీ (2 కోట్లు), రహ్మానుల్లా గుర్బాజ్ (2 కోట్లు), వైభవ్ అరోరా (1.80 కోట్లు), అజింక్య రహానే (1.5 కోట్లు), రోవ్‌మన్ పావెల్ (1.5 కోట్లు), ఉమ్రాన్ మాలిక్(75 లక్షలు), మనీశ్ పాండే (75 లక్షలు), అనుకూల్ రాయ్ (40 లక్షలు), లవ్నిత్ సిసోడియా (30 లక్షలు), మయాంక్ మార్కండే (30 లక్షలు)

### లక్నో సూపర్ జెయింట్స్

రిషబ్ పంత్ (27 కోట్లు), ఆవేశ్ ఖాన్ (9.75 కోట్లు), ఆకాశ్‌దీప్ (8 కోట్లు), డేవిడ్ మిల్లర్ (7.5 కోట్లు), అబ్దుల్ సమద్ (4.2 కోట్లు), మిచెల్ మార్ష్ (3.4 కోట్లు), షాబాజ్ అహ్మద్ (2.4 కోట్లు), ఎయిడెన్ మార్క్రమ్ (2 కోట్లు), మాథ్యూ బ్రీట్జ్కీ (75 లక్షలు), షమార్ జోసఫ్ (75 లక్షలు), ఎం సిద్దార్థ్ (75 లక్షలు), అర్శిన్ కులకర్ణి (30 లక్షలు), రాజవర్దన్ హంగార్గేకర్ (30 లక్షలు), యువరాజ్ చౌదరీ (30 లక్షలు), ప్రిన్స్ యాదవ్ (30 లక్షలు), ఆకాశ్ సింగ్ (30 లక్షలు), దిగ్వేశ్ సింగ్ (30 లక్షలు), హిమ్మత్ సింగ్ (30 లక్షలు), ఆర్యన్ జుయల్ (30 లక్షలు)



# ఐపీఎల్ మెగా వేలం

**రూ.639.15 కోట్లు ఖర్చుచేసిన ఫ్రాంచైజీలు**

**మార్చి 14 నుంచి ప్రారంభం ఐపీఎల్ 2025 సీజన్**

**సౌదీ అరేబియాలోని జెద్దా నగరంలో ఐపీఎల్ 2025 మెగా వేలం రెండు రోజుల పాటు విజయవంతంగా జరిగింది. ఈ భారీ ఈవెంట్‌లో మొత్తం 577 మంది ఆటగాళ్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకోగా, 182 మంది ఆటగాళ్లు వేలంలో అమ్ముడయ్యారు. మరో 395 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు ఎంచుకోలేదు. 8 మంది ఆటగాళ్లను ఫ్రాంచైజీలు రైట్ టు మ్యాచ్ కార్డుతో తనవారిని ఎంచుకున్నాయి. ఈ వేలంలో ఫ్రాంచైజీలు మొత్తం రూ.639.15 కోట్లు ఖర్చు చేశాయి. లక్నో సూపర్ జెయింట్స్ జట్టు రిషబ్ పంత్‌ను అత్యధికంగా రూ.27 కోట్లకు కొనుగోలు చేశారు. ఐపీఎల్ 2025 సీజన్ మార్చి 14 నుంచి ప్రారంభమవనుంది. ఈ సీజన్‌లో ఫ్రాంచైజీలు తీసుకున్న కొత్త ఆటగాళ్లతో జట్లు మరింత బలంగా కనిపిస్తున్నాయి.**

## భారీ ధరకు భారత పేసర్లు

రెండో రోజు ఐపీఎల్ మెగా వేలంలో భారత పేసర్లు అత్యధిక ధరలను దక్కించుకున్నారు. సీనియర్ పేసర్ భువనేశ్వర్ కుమార్ కనీస ధర రూ. 2 కోట్లతో ప్రారంభమవగా, ముంబయి, లఖ్‌నవూ జట్లు పోటీలోకి వచ్చాయి. చివరకు అనూహ్యంగా రేసులోకి చేరిన బెంగళూరు, భువనేశ్వర్‌ను రూ. 10.75 కోట్లకు తన జట్టులోకి చేర్చుకుంది. దీపక్ చాహర్ కూడా ఎక్కువ ధర దక్కించుకున్న పేసర్లలో ఒకడిగా నిలిచాడు. రూ. 2 కోట్ల కనీస ధరతో ప్రారంభమైన ఆయన వేలంలో ముంబయి, పంజాబ్ మధ్య పోటీ జరిగింది. చివరికి ముంబయి రూ. 9.25 కోట్లకు దీపక్‌ను దక్కించుకుంది. మరొక భారత పేసర్ ముకేశ్ కుమార్ వేలంలో అనూహ్య ధరకు చేరుకున్నాడు. రూ. 2 కోట్ల కనీస ధరతో చెన్నై, పంజాబ్ మధ్య పోటీ కొనసాగగా, ఆర్‌టీఎమ్ కార్డు ద్వారా ఢిల్లీ ముకేశ్‌ను రూ. 8 కోట్లకు సొంతం చేసుకుంది. టీమ్ ఇండియా ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్ కూడా మంచి ధర పొందాడు. పంజాబ్, లఖ్‌నవూ మధ్య పోటీ జరిగి, చివరకు లఖ్‌నవూ రూ. 8 కోట్లకు ఆకాశ్‌ను తన జట్టులో చేర్చుకుంది. సౌతాఫ్రికా ఆల్‌రౌండర్ మార్కో యాన్సెన్ కనీస ధర రూ. 1.25 కోట్లుగా ఉండగా, పంజాబ్ కింగ్స్ అతడిని రూ. 7 కోట్లకు కొనుగోలు చేసింది. ఇక తుషార్ దేశ్‌పాండేను రాజస్థాన్ రూ. 6.50 కోట్లకు దక్కించుకుంది. భారత ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్య రూ. 2 కోట్ల కనీస ధరతో ప్రారంభమై, బెంగళూరు రూ. 5.75 కోట్లకు కొనుగోలు చేసింది.అఫ్గానిస్థాన్ ఆఫ్-స్పిన్నర్ గజన్‌ఫర్ రూ. 75 లక్షల కనీస ధరతో ప్రారంభమై, ముంబయి ఇండియన్స్ రూ. 4.80 కోట్లకు సొంతం చేసుకుంది. ఇక నితీష్ రాణా రూ. 4.20 కోట్లకు రాజస్థాన్ జట్టులో చేరగా, వాషింగ్టన్ సుందర్‌ను గుజరాత్ రూ. 3.20 కోట్లకు కొనుగోలు చేసింది.

### ముంబై ఇండియన్స్

ట్రెంట్ బౌల్ట్ (12.50 కోట్లు), దీపక్ చాహర్ (9.25 కోట్లు), విల్ జాక్స్ (5.25 కోట్లు), నమన్ ధీర్ (5.25 కోట్లు), అల్లా ఘజన్‌ఫర్ (4.8 కోట్లు), మిచెల్ సాంట్నర్ (2 కోట్లు), ర్యాన్ రికెల్టన్ (1 కోటీ), లిజాడ్ విలియమ్స్ (75 లక్షలు), రీస్ టాప్లే (75 లక్షలు), రాబిన్ మింజ్ (65 లక్షలు), కర్ణ్ శర్మ (50 లక్షలు), విఘ్నేశ్ పుథుర్ (30 లక్షలు), అర్జున్ టెండూల్కర్ (30 లక్షలు), బెవాన్ జాన్ జాకబ్స్ (30 లక్షలు), వెంకట సత్యనారాయణ పెన్మత్స (30 లక్షలు), రాజ్ అంగద్ బవా (30 లక్షలు), శ్రీజిత్ కృష్ణణ్ (30 లక్షలు), అశ్వనీ కుమార్ (30 లక్షలు)

### పంజాబ్ కింగ్స్

అయ్యర్(26.75 కోట్లు), చహల్(18 కోట్లు), అర్షదీప్ సింగ్ (18 కోట్లు), స్టోయినిస్ (11 కోట్లు), మార్కో జన్సెన్ (7 కోట్లు), వధేరా (4.2 కోట్లు), మ్యాక్స్‌వెల్ (4.2 కోట్లు), ప్రియాన్ష్ ఆర్య (3.8 కోట్లు), ఇంగ్లిస్ (2.6 కోట్లు), ఒమర్‌జాయ్ (2.4 కోట్లు), ఫెర్గూసన్ (2 కోట్లు), విజయ్‌కుమార్ వైశాఖ్ (1.8 కోట్లు), యశ్ ఠాకర్ (1.60కోట్లు), హర్‌ప్రీత్ బ్రార్ (1.5కోట్లు), ఆరోన్ హార్డీ (1.25 కోట్లు), విష్ణు వినోద్ (95 లక్షలు), జేవియర్ బార్ట్‌లెట్ (80 లక్షలు), కుల్దీప్ సేన్ (80 లక్షలు), ప్రవిణ్ దూబే (30 లక్షలు), పైలా అవినాశ్ (30లక్షలు), సూర్యాంశ్ షెడ్గే (30 లక్షలు), ముషీర్ ఖాన్ (30 లక్షలు), హర్నూర్ పన్ను (30 లక్షలు)

### రాజస్థాన్ రాయల్స్

జోఫ్రా ఆర్చర్ (12.50 కోట్లు), తుషార్ దేశ్‌పాండే (6.5 కోట్లు), వనిందు హసరంగ (5.25 కోట్లు), మహీశ్ తీక్షణ (4.40 కోట్లు), నితీశ్ రాణా (4.2 కోట్లు), ఫజల్ హక్ ఫారూకీ (2 కోట్లు), క్వేనా మపాకా (1.5 కోట్లు), ఆకాశ్ మధ్వాల్ (1.20 కోట్లు), వైభవ్ సూర్యవంశీ (1.1 కోట్లు), శుభమ్ దూబే (80 లక్షలు), యుద్ధ్‌వీర్ చరక్ (35 లక్షలు), అశోక్ శర్మ (30 లక్షలు), కునాల్ రాథోడ్ (30 లక్షలు), కుమార్ కార్తికేయ (30 లక్షలు).

### రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

జోష్ హాజిల్‌వుడ్ (12.50 కోట్లు), ఫిల్ సాల్ట్ (11.50 కోట్లు), జితేశ్ శర్మ (11 కోట్లు), భువనేశ్వర్ కుమార్ (10.75 కోట్లు), లియామ్ లివింగ్‌స్టోన్ (8.75 కోట్లు), రసిఖ్ దార్ (6 కోట్లు), కృనాల్ పాండ్యా (5.75 కోట్లు), టిమ్ డేవిడ్ (3 కోట్లు), జేకబ్ బేతెల్ (2.6 కోట్లు), సుయాశ్ శర్మ (2.6 కోట్లు), దేవ్‌దత్ పడిక్కల్ (2 కోట్లు), నువాన్ తుషార (1.6 కోట్లు), రొమారియో షెపర్డ్ (1.5 కోట్లు), లుంగి ఎంగిడి (1 కోటీ) స్వప్నిల్ సింగ్ (50 లక్షలు), మోహిత్ రతీ (30 లక్షలు), అభినందన్ సింగ్ (30 లక్షలు), స్వస్తిక్ చికార (30 లక్షలు), మనోజ్ భాంగడే (30 లక్షలు)

### సన్‌రైజర్స్ హైదరాబాద్

ఇషాన్ కిషన్ (11.25 కోట్లు), మొహమ్మద్ షమీ (10 కోట్లు), హర్షల్ పటేల్ (8 కోట్లు), అభినవ్ మనోహర్ (3.20కోట్లు), రాహుల్ చాహల్ (3.20 కోట్లు), ఆడమ్ జంపా (2.40 కోట్లు), సిమ్రన్‌జీత్ సింగ్ (1.50 కోట్లు), ఎస్‌హాన్ మలింగ (1.2 కోట్లు), బ్రైడన్ కార్స్ (1 కోటీ), జయదేవ్ ఉనద్కత్ (1 కోటీ), కమిందు మెండిస్ (75 లక్షలు), జీషన్ అన్సారీ (40 లక్షలు), సచిన్ బేబి (30 లక్షలు), అనికేత్ వర్మ (30 లక్షలు), అథర్వ తైడే (30 లక్షలు)



## టెస్టు ర్యాంకింగ్స్‌లో జస్ప్రీత్ బుమ్రా నెంబర్ వన్


టీమిండియా స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా ఐసీసీ మెన్స్ టెస్ట్ బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో నంబర్ వన్ స్థానాన్ని దక్కించుకున్నారు. ఇటీవల ఆస్ట్రేలియాతో పెర్త్‌లో జరిగిన తొలి టెస్టులో 8 కీలక వికెట్లు తీసిన బుమ్రా, ఈ విజయంతో టీమిండియాకు 295 రన్స్ భారీ తేడాతో గెలుపు అందించారు. ఈ ప్రదర్శనతో బుమ్రా, కగిసో రబాడ, జోష్ హేజిల్‌వుడ్‌లను వెనక్కి నెట్టి అగ్రస్థానాన్ని సాదించాడు. బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో యశస్వి జైస్వాల్ రెండో స్థానానికి ఎగబాకారు. పెర్త్ మ్యాచ్‌లో 161 రన్స్ చేసి 825 పాయింట్లతో కెరీర్ బెస్ట్ సాధించారు. అయితే జో రూట్ కంటే 78 పాయింట్ల తేడాతో వెనుకంజలో ఉన్నారు. మరోవైపు 89 రన్స్ చేసిన ట్రావిస్ హెడ్ టాప్ 10లోకి చేరి 10వ స్థానంలో నిలిచారు. విరాట్ కోహ్లీ తన 30వ టెస్ట్ సెంచరీతో 13వ స్థానానికి ఎగబాకిన విషయం తెలిసిందే. టెస్ట్ ఆల్‌రౌండర్స్ జాబితాలో రవీంద్ర జడేజా, ఆర్. అశ్విన్ వరుసగా మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఆసీస్‌తో తొలి టెస్ట్ ఆడకపోయినప్పటికీ, ఈ జాబితాలో వారు ర్యాంకులను నిలబెట్టుకున్నారు. ఇక టెస్ట్ బౌలర్స్ ర్యాంకింగ్స్‌లో మొహమ్మద్ సిరాజ్ 25వ స్థానంలో ఉన్నారు. ఈ ర్యాంకింగ్స్ భారత్ క్రికెటర్ల అద్భుత ప్రదర్శనకు ప్రతిఫలంగా నిలిచాయి. బుమ్రా, జైస్వాల్, కోహ్లీ, జడేజా, అశ్విన్ అందరూ తమ ర్యాంకులను మెరుగుపరుచుకోవడంతో, భారత జట్టు టెస్టుల్లో తన ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది.

## రెండో టెస్టుకు కూడా శుభ్‌మన్ గిల్ దూరం?

ఇంట్రాస్క్వాడ్ వార్మప్ మ్యాచ్‌లో శుభమన్ గిల్ వేలికి గాయం అయిన విషయం తెలిసిందే. బోర్డర్ - గావస్కర్ ట్రోఫీలో ఆసీస్‌తో జరిగిన తొలి టెస్టులో గిల్ ఆడలేకపోయాడు. తాజాగా గిల్ యొక్క గాయంపై మరొక కీలక విషయం వెలుగులోకి వచ్చింది. వేలికి గాయం ఇంకా పూర్తిగా తగ్గకపోవడంతో, ప్రైమ్‌మినిస్టర్స్ జట్టుతో జరిగే రెండు రోజుల వార్మప్ మ్యాచ్‌లో అతడు ఆడడం కష్టమే. అలాగే, అడిలైడ్ వేదికగా పింక్‌బాల్ టెస్టులో కూడా అతడు అందుబాటులో ఉండకపోవచ్చని క్రికెట్ వర్గాలు సూచిస్తున్నాయి. గిల్‌కు కనీసం రెండు నుండి మూడు వారాలు విశ్రాంతి అవసరమని బీసీసీఐ వర్గాలు తెలిపాయి. ఈ విశ్రాంతి తర్వాతే అతని గాయం పరిస్థితిని పరిశీలించి, మళ్ళీ పరీక్షిస్తారు. "శుభ్‌మన్ గిల్‌కు కనీసం 14 రోజుల విశ్రాంతి అవసరమని వైద్య బృందం సూచించింది. వార్మప్ మ్యాచ్‌లో అతడు ఆడడు. రెండో టెస్టు డిసెంబర్ 6న ప్రారంభం కానుంది. అప్పటికే గాయం పరిస్థితిని పరిశీలించి, నిర్ణయం తీసుకుంటారు. గాయం పూర్తిగా తగ్గకపోతే, రెండో టెస్టుకు అతడు దూరం కావడం ఖాయం. గాయం తగ్గితే, రెండో టెస్టుకు ముందు ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొని, తుది జట్టుపై నిర్ణయం తీసుకుంటాం" అని బీసీసీఐ వర్గాలు తెలిపారు. సీనియర్ పేసర్ మహ్మద్ షమీ ఆసీస్‌కు చేరడంపై ఇంకా అనిశ్చితి కొనసాగుతోంది. రంజీ ట్రోఫీలో తన ఫామ్, ఫిట్‌నెస్‌ను నిరూపించుకున్న షమీ, ఐపీఎల్ మెగా వేలంలో కూడా మంచి ధర అందుకున్నాడు. అయితే, రెండో టెస్టుకు షమీ ఆసీస్‌కు చేరతారని ఎటువంటి అధికారిక ప్రకటనలు లేవు. "షమీని ఆసీస్‌కు పంపించడంపై ఎలాంటి చర్చలు జరగలేదు. అక్కడి మైదానాలు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉంటాయని తెలుసు. జట్టులో ఇప్పటికే చాలామంది పేసర్లు ఉన్నారు.



పెర్త్‌లో ఫాస్ట్ బౌలర్లు మంచి ప్రదర్శన ఇచ్చారు" అని బీసీసీఐ వర్గాలు తెలిపారు. ఆస్ట్రేలియాతో రెండో టెస్టుకు దాదాపు పది రోజులు మాత్రమే ఉంది.తొలి టెస్టుకు దూరమైన రోహిత్ శర్మ జట్టుతో చేరాడు. అయితే, అతడు ఎవరి స్థానంలో వస్తాడనేది ఒక ప్రశ్నగా మారింది. ఓపెనర్‌గా వచ్చిన కేఎల్ రాహుల్ కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకున్నాడు. అలాగే, దేవదత్ పడిక్కల్ కూడా రెండో ఇన్నింగ్స్‌లో మెరుగైన ప్రదర్శన ఇచ్చాడు. రోహిత్ వస్తే,పడిక్కల్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు బ్యాటర్ల ప్లేస్‌మెంట్ కూడా కీలకమైన చర్చాంశంగా మారింది. రోహిత్ శర్మ ఓపెనర్‌గా వస్తారా? లేకపోతే కేఎల్ రాహుల్‌ను కొనసాగిస్తారా? అన్నది చూడాలి. ఒకవేళ రోహిత్‌తో యశస్వి ఓపెనింగ్ ప్రారంభిస్తే,కేఎల్‌ను వన్‌డౌన్‌లో ఆడించాల్సి ఉంటుంది. తదుపరి విరాట్, రిషభ్ పంత్, ధ్రువ్ జురెల్, నితీష్ కుమార్ రెడ్డి బ్యాటింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. పింక్‌బాల్ టెస్టులో బౌలింగ్ విభాగంలో పెద్ద మార్పులు ఉండకపోవచ్చని క్రికెట్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.



## రెజ్లర్ బజరంజ్ పూనియాపై నాలుగేండ్ల నిషేధం

**నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ కఠిన చర్యలు**

భారత ప్రముఖ రెజ్లర్ బజరంగ్ పునియాపై నేషనల్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ కఠిన చర్యలు తీసుకుంది. యాంటీ డోపింగ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు అతనిపై నాలుగేళ్ల నిషేధం విధించింది. ఈ నిర్ణయం పునియాకి ఆటగాడిగా అతని భవిష్యత్తు మీద గట్టి ప్రభావం చూపనుంది. మార్చి 10న జాతీయ జట్టుకు ఎంపిక ట్రయల్స్ సందర్భంగా డోప్ టెస్ట్ కోసం నమూనా ఇవ్వడానికి బజరంగ్ నిరాకరించడంతో ఈ నిర్ణయానికి వచ్చింది. అంతకుముందు, ఏప్రిల్ 23న టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పునియాను తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. అనంతరం, ప్రపంచ రెజ్లింగ్ సంస్థ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్) కూడా అతనిపై చర్యలు తీసుకుంది. ఈ నిషేధంపై బజరంగ్ అప్పీల్ చేశాడు. మే 31న,క్రమశిక్షణా డోపింగ్ ప్యానెల్ నోటీసు జారీ చేయడంతో, అప్పటికే ఉన్న నిషేధాన్ని తాత్కాలికంగా రద్దు చేసింది. అయితే, జూన్ 23న నాడా అతనికి అధికారిక నోటీసు పంపింది. ఇదిలా ఉండగా, బజరంగ్ తన సహచర రెజ్లర్ వినేష్ ఫోగట్‌తో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో అతనికి ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ బాధ్యతలు అప్పగించారు. జూలై 11న బజరంగ్ నేరారోపణలను ధైర్యంగా సవాలు చేశాడు. చివరికి, సెప్టెంబర్ 20, అక్టోబర్ 4న జరిగిన విచారణల తర్వాత ఈ నిషేధం అమలులోకి వచ్చింది.




## నా కెరీర్‌లో ఎక్కువ కష్టపడింది వర్షం సినిమాకే : త్రిష

తమిళ బ్యూటీ త్రిష కృష్ణన్ వర్షం సినిమాతో తెలుగు ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. ప్రభాస్ కథానాయకుడిగా వచ్చిన ఈ చిత్రం 2004లో వచ్చి మంచి విజయాన్ని అందుకోవడమే కాకుండా త్రిషకు ఉత్తమ నటిగా ఫిలిం ఫేర్ అవార్డు తెచ్చిపెట్టింది. అయితే తన కెరీర్‌లో ఇప్పటివరకు అత్యంత కష్టపడిన సినిమా అంటే వర్షం సినిమానే అని చెప్పుకొచ్చింది ఈ భామ. రీసెంట్‌గా ఒక తమిళ అవార్డుల వేడుకలో పాల్గొన్న త్రిష కృష్ణన్ తన అమ్మ ఉమ కృష్ణన్‌తో హాజరైంది. అయితే అవార్డు తీసుకోవడానికి వేదికపైకి త్రిష వెళ్లగా.. యాంకర్ త్రిష అమ్మను అడుగుతూ.. త్రిష కృష్ణన్ తన కెరీర్‌లో ఏ సినిమాకు అత్యంత కష్టపడిందని అడుగుతుంది. దీనికి ఉమ కృష్ణన్ మాట్లాడుతూ.. త్రిష కెరీర్‌లో చాలా కష్టపడిన చిత్రం వర్షం. ఈ సినిమా కోసం 45 రోజులు వర్షంలోనే గడిపాం. ఇదంత చూసి ఈ సినిమా మానేసి చెన్నైకి వెళదాం అనుకున్నాం. కానీ ధైర్యంతో ముందుకు నడిచాం. ఈ సినిమా విడుదలయ్యాక మా కష్టం అంతా మర్చిపోయం. సినిమా చాలా పెద్ద హిట్ అయ్యింది. అని చెప్పగానే.. త్రిష కూడా అవును వర్షం సినిమాకే నేను చాలా కష్టపడ్డాను అంటూ చెప్పుకొచ్చింది. వర్షం సినిమాతో హీరోయిన్‌గా ఎంట్రీ ఇచ్చి ఆ తర్వాత స్టార్ హీరోయిన్‌గా ఎదిగింది త్రిష. తెలుగులో నువ్వొస్తానంటే నేనొద్దంటానా, అతడు, పౌర్ణమి, స్టాలిన్, సైనికుడు, ఆడవారి మాటలకు అర్థాలే వేరులే, కృష్ణ, బుజ్జిగాడు వంటి చిత్రాలతో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవితో కలిసి విశ్వంభర అనే పాన్ ఇండియన్ సినిమాలో నటిస్తుంది.



## కాబోయే భర్తను పరిచయం చేసిన కీర్తి సురేష్




దక్షిణాది అగ్ర కథానాయికల్లో ఒకరైన కీర్తి సురేశ్ త్వరలోనే పెళ్లి పీటలు ఎక్కబోతున్నట్లు జోరుగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. తన చిరకాల మిత్రుడు ఆంటోనీ తట్టిల్‌తో ఏడడుగులు వేయబోతున్నారంటూ తమిళ మీడియాతో పాటు ఇటు తెలుగులో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ఈ నేపథ్యంలో కీర్తి తాజాగా కీలక ప్రకటన చేశారు. సోషల్ మీడియాలో వస్తున్న వార్తలను నిజం చేస్తూ.. తన బాయ్‌ఫ్రెండ్‌ను కీర్తి సురేశ్ తాజాగా పరిచయం చేశారు. ఆంటోని తట్టిల్‌తో 15 ఏళ్లుగా ప్రేమలో ఉన్నట్లు స్పష్టం చేశారు. ఈ మేరకు ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ఇద్దరూ సూర్యుడివైపు చూస్తున్న ఓ అందమైన ఫొటోను పంచుకున్నారు. ట్వీట్‌కు లవ్ సింబల్‌తో అని క్యాప్షన్ పెట్టారు. ఈ ట్వీట్ చూసిన అభిమానులు, నెటిజన్లు కీర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆంటోనీ దుబాయ్‌కి చెందిన వ్యాపారవేత్త అని తెలిసింది. వీరిద్దరూ కలిసి ఒకే పాఠశాలలనే చదివినట్లు సదరు కథనాలు పేర్కొంటున్నాయి. ఈ హైస్కూల్ ప్రేమికులు ఇప్పుడు వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారు. కాగా, డిసెంబర్ రెండో వారంలో డెస్టినేషన్ వెడ్డింగ్ జరగనుందని సమాచారం. డిసెంబర్ 11, 12 తేదీల్లో గోవాలో గ్రాండ్ వెడ్డింగ్ జరగబోతోందంట. ఈ వివాహ వేడుకకు కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరుకానున్నట్లు తెలిసింది. అయితే, తమ మధ్య ఉన్న రిలేషన్ షిప్ గురించి ఓపెన్ అయిన కీర్తి సురేశ్.. పెళ్లి గురించి మాత్రం ఎలాంటి క్లారిటీ ఇవ్వలేదు.

## మాళవిక మోహనన్ గెలాక్సీ హొయలు

టాలీవుడ్ గ్లామరస్ బ్యూటీ మాళవిక మోహనన్ తన గ్లామర్‌తో నెట్టింట హీట్ పెంచేస్తోంది. ఇటీవల సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన ఫోటోలు అభిమానులను మంత్రముగ్ధుల్ని చేశయి. వింటేజ్ స్టైల్ డ్రెస్‌లో కనిపించిన మాళవిక మరింత ఆకర్షణీయంగా మెరిసింది. ఈ లుక్స్‌లో ఆమె హుందాతనాన్ని, హాట్‌నెస్‌ను మేళవించి ప్రెజెంట్ చేసింది.

తాజా ఫోటోల్లో ఆమె నలుపు, వింటేజ్ జాకెట్ కాంబినేషన్‌లో అదిరిపోయే లుక్స్ ఇచ్చింది. ఆమె చేతికి అందంగా మెరిసే వింటేజ్ రింగ్, చెవులకు ప్రత్యేకమైన హంగు తీసుకువచ్చే జంకి ఈలిగెంట్ లుక్‌ను పెంచాయి. మాళవిక తన ఎద అందాలను హైలైట్ చేస్తూ స్టైల్‌ని ప్రెజెంట్ చేసింది. ఈ ఫోటోలు ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి స్పందనను పొందాయి. కామెంట్స్‌లో నెటిజన్లు ఆమె అందాన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. మాళవిక మోహనన్ మొదట మలయాళ చిత్రంతో సిల్వర్ స్క్రీన్ పై అడుగుపెట్టింది. ఆమె తొలి చిత్రమే తన కెరీర్‌కు మంచి శుభారంభం ఇచ్చింది. ఆ తరువాత 'మారి 2', 'మాస్టర్' వంటి సినిమాల్లో నటిస్తూ దక్షిణాది పరిశ్రమలో తనకంటూ ప్రత్యేక గుర్తింపును సాధించింది. కాగా ఆమె నటించిన 'బియాండ్ ది క్లౌడ్స్' అనే హిందీ సినిమా కూడా మంచి పేరు తెచ్చిపెట్టింది. ప్రస్తుతం మాళవిక పాన్ ఇండియా సినిమాల్లో అవకాశాలను అందుకుంటోంది. ప్రభాస్‌తో కలిసి 'రాజా సాబ్' సినిమాలో నటిస్తూ బిజీగా ఉంది. అలాగే, కార్తీ సరసన సర్దార్ 2లో కీలక పాత్ర పోషిస్తోంది. ఈ రెండు ప్రాజెక్ట్‌లు ఆమె కెరీర్‌ను మరింత ముందుకు తీసుకెళ్తాయని అంచనా. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మాళవిక మోహనన్ తన గ్లామర్ ఫోటోషూట్లతో అభిమానులను మెస్మరైజ్ చేస్తుంటుంది. ఇటీవలి కాలంలో ఆమె వింటేజ్ ఫోటోషూట్లు, ట్రెండీ లుక్స్‌తో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. మరి అమ్మడు రాబోయే రోజుల్లో ఎలాంటి అవకాశాలు అందుకుంటుందో చూడాలి.



Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986